

మద్దిపాడు మండలం గార్లపాడులోని బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

బర్లీ పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం

- ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

7

అలా వచ్చారు.. ఇలా వెళ్లారు!

- వైసీపీ నేతల ఆక్రమిత భూములపై తూతూమంత్రంగా అధికారుల సర్వే
- నెలల తరబడి అదే తంతు
- ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశాలతో భూ కొలతలు చేపట్టిన డీఈఐఎస్

7

- భారీ ఈవెంట్‌గా మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్
- గిన్నిస్ బుక్ అవార్డు సాధనే లక్ష్యం
- నేడు అన్ని పాఠశాలల్లో పండుగలా కార్యక్రమం
- పనుల్లో తలమునకలైన ఉపాధ్యాయులు
- మార్గదర్శకాలు జారీ చేసిన ఉన్నతాధికారులు



రారండోయ్!

జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ఒక మెగా ఈవెంట్‌ను తలపిస్తోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం తరహాలో ఈ మెగా పీటీఎంను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ బుక్ అవార్డు సాధనే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లను భారీగా చేస్తున్నారు. గత వారం రోజులుగా కార్యక్రమ పనుల్లోనే ఉపాధ్యాయులు, విద్యార్థులు తలమునకలవుతున్నారు. పీటీఎంకు ఏర్పాట్లు ఎలా చేయాలో పాఠశాల విద్యా డైరెక్టర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌లు ప్రతిరోజు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఏర్పాట్లలో టీచర్లను చేయిపట్టి నడిపిస్తున్నారు.

ఒంగోలు విద్య, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం)ను పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమగ్ర చర్యలు తీసుకున్నారు. ఈ పీటీఎం నిర్వహణకు సంబంధించి పాఠశాలల్లో సాక్షులను నియమించి వారి సంతకాలతో నివేదికలు, ఫొటోలు లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. ఏ విషయంలో కూడా రాజీ పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల ముఖద్వారాలకు మామిడి తోరణాలు, భవన పిల్లర్లకు కొబ్బరి ఆకులు, అరటి బోదెలు, చుట్టూ ఒక శుభకార్యం జరుగుతుందన్న భావన కల్పిస్తున్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ పీటీఎం నిర్వహణకు సంబంధించి కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

తల్లిదండ్రులకు పోటీలు

మెగా పీటీఎంల సందర్భంగా తల్లిదండ్రుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు వారికి పోటీలు నిర్వహించాలి. తల్లులకు రంగవల్లులు, నిమ్మకాయ పోటీలు, మ్యూజికల్ చైర్

మిగతా 6లో...

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

ఈ మెగా పీటీఎంకు హాజరుకావాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామస్థాయి నాయకులకు, ఎస్ఎంసీ కమిటీలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు హెచ్ఎంలు, టీచర్లు స్వయంగా ఆహ్వానిస్తున్నారు. అందుకు సంబంధించి గత నెలరోజులుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ పీటీఎంకు హాజరుకావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అన్ని పాఠశాలల్లో సమావేశాలు ఘనంగా జరగనున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి వారి తరగతి గదిలో కూర్చోవాలి. అతిథులు, దాతలు, షైనింగ్ స్టార్ అవార్డు గ్రహీతలు, పూర్వ విద్యార్థులు హెచ్ఎం గదిలో కూర్చోవాలి. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలి. తల్లిదండ్రులకు తమ పిల్లల విద్యాప్రగతిని వివరించాలి. సమావేశంలో విద్యార్థులు ఏమి మాట్లాడాలి, తల్లిదండ్రులు ఏమి మాట్లాడాలో ముందుగానే వారిని సమగ్రంగా సిద్ధం చేయాలి. విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా పూర్వ విద్యార్థులు షైనింగ్ స్టార్స్ ప్రసంగాలు ఏర్పాటు చేయాలి. 4వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమం కింద మొక్క నాటాలి. అందుకోసం జిల్లావ్యాప్తంగా 1.96 లక్షల మొక్కలు అందించనున్నారు.


పి.లక్షిత్ (ఫైల్)

ఏమయ్యాడో!

- లింగోజీపల్లిలో బాలుడి అదృశ్యం
- రెండు రోజులుగా గాలిస్తున్న పోలీసులు, గ్రామస్థులు
- మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించని బాబు
- బుధవారం నల్లవాగు వద్ద చెప్పులు గుర్తించిన పోలీసులు
- గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని అనుమానం


జాగిలాలతో గాలిస్తున్న పోలీసులు

కంభం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం ఎల్.కోట పంచాయతీ పరిధిలోని లింగోజీపల్లిలో బాలుడు(4) అదృశ్యం కావడం సంచలనంగా మారింది. కంభం పోలీసుల కథనం ప్రకారం.. లింగోజీపల్లి గ్రామానికి చెందిన సురేఖకు కొనకనమిట్ల మండలం గొట్లకట్టు గ్రామానికి చెందిన పొదిలి శ్రీనుతో ఐదేళ్ల కిందట వివాహమైంది. వీరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరికి నాలుగేళ్ల బాలుడు ఉన్నాడు. 2 నెలల క్రితం సురేఖ రెండో కాన్పు కోసం పుట్టిల్లు లింగోజీపల్లికి వచ్చింది. గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాలకు లక్షిత్‌ను పంపిస్తోంది. మంగళవారం ఉదయం 9 గంటలకు లక్షిత్‌ను అంగన్‌వాడీ కేంద్రంలో వదిలి వచ్చారు. 12 గంటల సమయంలో లక్షిత్ కేంద్రం నుంచి బయటకు వచ్చి తిరిగి వెళ్లలేదు. ఇంటికి వెళ్లి ఉంటాడని అంగన్‌వాడీ టీచర్ గోవిందరమ్మ, ఆయా క్రిష్ణకుమారి భావించారు. సాయంత్రం 4 గంటలకు బాలుడి అమ్మమ్మ రావడంతో బాలుడు ఇంటికి వెళ్లలేదని తెలుసుకుని బాలుడి కోసం ఊరంతా గాలించారు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్కాపురం సీఐ నాగరాజు, కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు మంగళవారం సాయంత్రం లింగోజీపల్లికి వచ్చి డ్రోన్ సహాయంతో గ్రామం చుట్టు పక్కల గాలించగా ఆచూకీ లభ్యం కాకపోవడంతో, ఈలోగా గంట పాటు భారీవర్షం కురవడంతో ఆపివేశారు. బుధవారం ఉదయమే లింగోజీపల్లి వచ్చిన పోలీస్ సిబ్బంది గ్రామస్థులతో కలిసి గ్రామం చుట్టుపక్కల గాలించగా, 2 కిలోమీటర్ల దూరంలో లింగోజీపల్లి-సూరేపల్లి గ్రామాల మధ్య నల్లవాగు సమీపంలో బాలుడి చెప్పులు చిల్లకంప వద్ద గుర్తించారు. దీంతో ఒక్కసారిగా గ్రామంలో అలజడి రేగింది. కుమారుడి చెప్పులు గుర్తించి తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. అంగన్‌వాడీ పాఠశాల, ఎలిమెంటరీ పాఠశాల పక్కపక్కనే ఊరి బయట ఉండడం, విద్యార్థులందరూ కాలకృత్యాలు తీర్చుకోవడానికి సమీపంలోని చిల్లకంప వద్దకు వెళ్తుంటారు. మంగళవారం కూడా బాలుడు చిల్లచెట్ల వైపు వెళ్లడం పాఠశాలలో చదువుతున్న బాలుడు చూసినట్లు చెప్తున్నారు. మంగళవారం గ్రామంలోకి ప్లాస్టిక్ పేపర్లు, చిత్తుకాగితాలు ఏరుకునేవారు వచ్చారని, ఒంటరిగా ఉన్న బాబును వారే తీసుకెళ్లి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

బాలుడి ఆచూకీ కోసం వచ్చిన జాగిలం

లక్షిత్ ఆచూకీ కనుగొనేందుకు ఒంగోలు నుంచి వచ్చిన పోలీసు జాగిలం గ్రామానికి దూరంగా 2 కిలోమీటర్ల దూరంలోని నల్లవాగు సమీపంలో చెప్పుల వాసనను చూసి నేరుగా బాలుడు చదువు కుంటున్న అంగన్‌వాడీ స్కూలుకు వచ్చింది. అక్కడి నుంచి తిరిగి చెప్పుల వద్దకు వెళ్లి గ్రామం వెలుపల ఉన్న వాటర్‌ట్యాంక్ వద్దకు వెళ్లి, అక్కడి నుంచి సూరేపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి మళ్లీ చెప్పుల వద్దకే వచ్చింది. కంభం-తర్లుపాడు రోడ్డులోని ఎడారి ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చి జాగిలం ఆగిపోయింది. బాలుడి కిడ్నాప్ అయినట్లు భావిస్తున్న తరుణంలో ఆ రాత్రి భారీ వర్షం కురవడంతో జాగిలం పసిగట్టలేకపోయిందని భావిస్తున్నారు. జాగిలం వెంట గ్రామస్థులు కూడా వెళ్లారు.



కదంతొక్కిన కార్మికులు

- సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లాలో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు
- ఒంగోలులో భారీ ర్యాలీ, పాల్గొన్న సీపీఐ రాష్ట్ర నేత రామకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్తసార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లాలో బుధవారం కార్మికులు కదంతొక్కారు. ప్రధాన కార్మిక సంఘాలైన సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, పరిశ్రమలు ఉన్న ప్రాంతాలు, బ్యాంకు కార్యాలయాల వద్ద కార్మికులు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. జిల్లాలో సుమారు 30వేల మందికిపైగా వివిధ రంగాల్లో కార్మికులు ఈ ఆందోళనల్లో భాగస్వామ్యులయ్యారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడంపై మండిపడ్డారు. ఒంగోలులో ఆయా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఒంగోలులోని నెల్లూరు బస్టాండులోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద ఏఐబీఈఏ, ఏఐబీవోఏ, బెఫీల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఇలా అన్ని బ్యాంకు కార్యాలయాలతో పాటు ఎల్ఐసీ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఈ ఆందోళనలు జరిగాయి.

రేషన్‌కార్డు స్థానంలో స్మార్ట్ కార్డు

- క్యూఆర్‌కోడ్‌తో ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారుల ఫొటో
- కొత్త వాటి కోసం దరఖాస్తులు చేసుకున్నవారికి వచ్చేనెలలో స్మార్ట్ కార్డులు
- కసరత్తు ప్రారంభించిన పౌరసరఫరాల శాఖ



స్మార్ట్ కార్డు నమూనా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాత కార్డుల్లో పేరు నమోదుతో పాటు కొత్తగా దరఖాస్తులు చేసుకున్న వారందరికీ స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. అందుకోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు ప్రక్రియను ప్రారంభించారు. స్మార్ట్ కార్డుల్లో క్యూఆర్ కోడ్‌తో పాటు ప్రభుత్వ అధికారిక చిహ్నంతో పాటు లబ్ధిదారుల ఫొటో ఉంటుంది. లబ్ధిదారులు రేషన్‌షాపుల వద్ద క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రేషన్ తెచ్చుకొనేందుకు అవకాశం కల్పించారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ఇప్పటికే అందుకు అవసరమైన కసరత్తు ప్రారంభమైంది. జిల్లాలో 1,392 రేషన్

మిగతా 6లో...

సహకార శాఖలో ఏం జరుగుతోంది?

- ఆంధ్రజ్యోతి కథనంపై ఇంటెలిజెన్స్ ఆరా
- మంత్రులు లోకేష్, అచ్చెన్నల దృష్టికి వ్యవహారం

ఒంగోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార శాఖ కార్యాలయ ఉద్యోగులకు జీతాలు ఎందుకు ఆగిపోయాయి? అసలు కలెక్టర్ నియమించిన ఇన్‌చార్జి డీసీవోను ఉన్నతాధికారులు ఎందుకు ధ్రువీకరించలేదు? అసలు సహకారశాఖలో ఏమి జరుగుతోంది? అన్నదానిపై ఇంటెలిజెన్స్ పోలీసు విభాగం అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ అంశాలతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రాష్ట్ర, జిల్లాస్థాయి సహకారశాఖ అధికారులు అనుసరిస్తున్న వైఖరి, దానివల్ల ఎదురవుతున్న సమస్యలపై 'సహకారశాఖలో విచిత్రం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనం సహకారశాఖ అధికారవర్గాల్లోనే కాక ఇతర శాఖల అధికారులు, ఉద్యోగుల్లోనూ చర్చనీయాంశమైంది. ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తుల వద్దకు కూడా సమాచారం

మిగతా 6లో...



ఖాతాలకు జమ కాని కాంపోజిట్ స్కూలు గ్రాంటు

- జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్ల బ్యాంక్ ఖాతాలకు ఈకేవైసీ చేయించకపోవడమే కారణం
- హెచ్ఎంల సొంత డబ్బులతో పీటీఎం ఖర్చులు

7

కక్షిదారుల సమస్యల పరిష్కారానికి మెరుగ్గా చర్యలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

7



మార్కాపురం మండలం వేములపాడులో రైతుల సమక్షంలో జాబితా ప్రదర్శిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

అన్నదాత సుఖీభవ జాబితాలు సిద్ధం

- జిల్లాలో 2.74 లక్షల మంది అర్హులుగా గుర్తింపు
- ఈకేవైసీ చేసిన వారికి పథకం వర్తింపు
- రైతు సేవా కేంద్రాల్లో పేర్ల ప్రదర్శన, త్వరలో నగదు జమ

ఒంగోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితాలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం లబ్ధిదారుల గుర్తింపు కోసం వ్యవసాయ, రెవెన్యూ ఇతర శాఖలు సంయుక్తంగా కసరత్తు చేశాయి. నిబంధనలకు అనుగుణంగా అర్హులైన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ ప్రకటించింది. ఆ ప్రకారం జిల్లాలో మొత్తం 2.74 లక్షల మంది రైతులు అర్హులుగా తేలారు. వారిలో ఈకేవైసీ పూర్తయిన, ఇంకా పెండింగ్ ఉన్న ఈకేవైసీలో తిరస్కరించబడిన కేటగిరీల వారీగా రూపొందించిన జాబితాలను జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం వ్యవసాయశాఖ సిబ్బంది ప్రదర్శించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఏడాదికి రూ.20వేలు నగదు రైతులకు పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం పేరుతో ఇవ్వనున్నట్లు ఎన్నికల ప్రణాళికలో

మిగతా 6లో...

విద్యుదాఘాతానికి రైతు మృతి

పుల్లలచెరువు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్ద తీగలను తగిలిస్తూ విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లలచెరువు మండలం కొండారెడ్డికాలనీ చెందిన మునగాల శేషిరెడ్డి(65) బుధవారం తన పొలంలో ట్రాన్స్‌ఫారం వద్ద తీగలు తగిలిస్తుండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందారు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య సీతారామమ్మ ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. శేషిరెడ్డికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలి

ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి



తహసీల్దారు వద్ద నిందితులను సరెండర్ చేసిన దృశ్యం

పెద్ద దోర్నాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఎంఆర్‌పీ ధరలకే మద్యం విక్రయించాలని ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి చెప్పారు. మండలంలోని పనుకుమడుగు, కడపరాజుపల్లె, ఐనముక్కుల గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేసులు లభించలేదు. అనంతరం ఆగ్రామాల్లో సారా నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోర్నాలలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిబంధనల మేరకు సమయం పాటించాలని సీఐ సూచనలు చేశారు. తదుపరి తహసీల్దార్ కార్యాలయంలో పాత నిందితులను రూ.2,00,000కు తహసీల్దార్ అశోక్‌రెడ్డికి బైండోవర్ చేశారు.

వలస కార్మికుడి ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషయం

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఏసు బుధవారం పురుగుల మందు తాగాడని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి పరిస్థితి విషమంగా ఉందన్నారు. వారి కథనం మేరకు.. ఏసు పదిహేనేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లారెడ్డిపేటకు వలస వచ్చాడు. స్థానికంగా భవన నిర్మాణ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సరైన పనులు లభించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబంలో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఏసు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు మొదట సిరిసిల్లకు తరలించారు. అక్కడనుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఏసు పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

నేటి నుంచి ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

పెదకాకాని, జూలై 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ, డిప్లమా, సర్టిఫికెట్ ప్రోగ్రాం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, దూర విద్యా పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ తెలిపారు. పరీక్షలు ఆగస్టు ఏడో తేదీ వరకు కొనసాగుతాయన్నారు. సెమిస్టర్ విధానంతో పాటు, వార్షిక, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:00 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 2 సెషన్లలో పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 114 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా, వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సజావుగా పరీక్షల నిర్వహణకు ప్రత్యేక పరిశీలకులను నియమించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలలో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక స్క్వాడ్ బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

పట్టణాలకు మహర్దశ

- అమృత్ 2.0 కింద మౌలిక వసతులకు భారీగా నిధులు
- నాలుగు జిల్లాలకు రూ.1622.63 కోట్లు
- 23 మున్సిపాలిటీల్లో ఇంటింటికీ తాగునీరు
- నెల్లూరులో మురుగునీటి నిర్వహణకు రూ.230 కోట్లు
- రెండేళ్లలో పనులు చేయాలని లక్ష్యం
- టెండర్లు ఆహ్వానించిన పబ్లిక్ హెల్త్ అధికారులు

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనుంది. కనీస మౌలిక వసతులైన తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి వంటి పనులు చేసేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులు చేపడుతోంది. ఇటీవల కాలంలో ఈ స్థాయిలో మున్సిపాలిటీలకు నిధులు మంజూరవడం ఇదే ప్రథమం. పబ్లిక్ హెల్త్ విభాగం ఈ పనుల నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలకు అమృత్ 2.0 పథకం కింద రూ.10,251 కోట్లను మంజూరు చేయగా అందులో పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్‌కు రూ.1622.63 కోట్లను కేటాయించారు. ఈ సర్కిల్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలు ఉన్నాయి. ఈ నాలుగు జిల్లాల పరిధిలోని 23 అర్బన్ లోకల్ బాడీలకు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) నిధులను విభజించారు. ఆయా మున్సిపాలిటీల్లో అవసరాలను బట్టి నిధులు కేటాయించారు. అమృత్ 2.0 పథకం కింద నిధులను మూడు విభాగాలకు ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. అందులో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి ఉన్నాయి. ఈ దఫా ఇంటింటికీ తాగునీటిని కుళాయిల ద్వారా ఇవ్వాలన్నది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసమే సింహభాగం నిధులను కేటాయించారు. ఒక్క ఒంగోలు కార్పొరేషన్‌కే రూ.224.42 కోట్లు మంజూరు చేశారు. పొదిలి, దర్శి, నెల్లూరు, వెంకటగిరి పట్టణాలకు కూడా భారీగా నిధులు దక్కాయి. ఇక నెల్లూరులో మురుగునీటి శుద్ధి నిర్వహణకు రూ.230.23 కోట్లు కేటాయించడం విశేషం. ఈ నిధులతో నెల్లూరు నగరంలో పెండింగ్ ఉన్న తాగునీటి, యూజీడీ పనుల్లో పురోగతి కనిపించనుంది. అలానే దాదాపుగా అన్ని మున్సిపాలిటీల్లో అక్కడ ఉన్న నీటి వనరులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు నిధులు మంజూరు చేశారు. మొత్తంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీలకు సంబంధించి ఇంటింటికీ తాగునీటి సరఫరాకు గానూ 310.37 కోట్లు మంజూరవడం గమనార్హం. నీటి వనరుల అభివృద్ధికిగానూ రూ.22.33 కోట్లు దక్కాయి.



ఒంగోలు నగరం

అమృత్ 2.0 కింద వివిధ మున్సిపాలిటీలకు మంజూరైన నిధుల వివరాలు...

మున్సిపాలిటీ	తాగునీటి సరఫరా	మురుగునీటి నిర్వహణ	నీటివనరుల అభివృద్ధి
ఒంగోలు	224.42కోట్లలో	55.89కోట్లలో	4.24కోట్లలో
పొదిలి	134.15	---	---
దర్శి	130.61	---	1.10
మార్కాపురం	71.93	---	---
గిద్దలూరు	2.81	---	--
కనిగిరి	4.07	---	---
చీమకుర్తి	3.07	---	---
కందుకూరు	34.66	----	7.54

రెండేళ్లలో పూర్తి

అమృత్ 2.0 పథకం కింద పబ్లిక్ హెల్త్ అధికారులు రూ.1622.63 కోట్ల విలువైన పనులకు టెండర్లు ఆహ్వానించారు. గత నెల 30న టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈ నెల 28 వరకూ బిడ్ల దాఖలకు అవకాశం కల్పించారు. 23 మున్సిపాలిటీల్లో 73 వర్కులుగా విభజించారు. వాటన్నింటినీ ఒకే ప్యాకేజీగా టెండర్ పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. నెల రోజుల్లోపు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆ వెంటనే పనులు మొదలు పెట్టించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ పనులు మొదలైతే అన్నీ మున్సిపాలిటీల్లో అభివృద్ధి హడావిడి కనిపిస్తుంది. ఈ పనులపై పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ మోహన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. 23 అర్బన్ లోకల్ బాడీల్లో 73 పనులకు గాను టెండర్లు పిలిచినట్లు తెలిపారు.

బర్లీ పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం

- ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

మద్దిపాడు, జూలై9 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకును ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని, రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నదని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. మద్దిపాడు మండలం గార్లపాడులోని బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ షెడ్యూలు ప్రకారం రైతులు తమ పొగాకు బేళ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. గత 15రోజులుగా హెచ్‌డీ బర్లీ పొగాకును కొనుగోలు జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 110మంది రైతుల వద్ద నుంచి రూ.3కోట్ల విలువ చేసే 360మెట్రిక్ టన్నుల పొగాకును కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు. సెప్టెంబరు నెలాఖరు వరకు కొనుగోలు జరుగుతుందని, అందువల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, తహసీల్దార్ ఆదిలక్ష్మి రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

పీ4 పథకం మార్గదర్శకులను త్వరగా గుర్తించాలి

ఒంగోలు(రూరల్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): పీ 4 పథకం కింద మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియోజకవర్గ ప్రత్యేక అధికారులు,మండల అధికారులతో మాట్లాడారు. అధికారులు కూడా స్వచ్ఛందంగా బంగారుకుటుంబాలకు అండగా నిలిచేందకు ముందుకు రావాలన్నారు. తాను కూడా 10 కుటుంబాలను దత్తత తీసుకుంటానని చెప్పారు. పీ4 పథకానికి ఆగస్టు 15వరకు గడువు ఉన్నప్పటికి ఈనెలాఖరుకు గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రకాశం జిల్లాలో అభివృద్ధికి 75వేల కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతవిద్యావంతులను సంప్రదించి మార్గదర్శకులుగా ముందుకు వచ్చేందుకు వారితో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటే ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


స్కూళ్లు ముగిశాక ఇళ్లకు వెళ్లాలంటే బస్సేదీ?

- సాయంత్రం 3.30 నిమిషాల తర్వాత తిరిగి 5.30కి పొదిలివైపు బస్సు
- దాదాపు గంటన్నరపాటు ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థుల పడిగాపులు

కొండపి, జూలై9 (ఆంధ్రజ్యోతి): కొండపిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పొదిలి రూటులోని గ్రామాలకు చెందిన దాదాపు 50 మందికిపైగా విద్యార్థులు ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్నారు. కొండపిలో సాయంత్రం 4.30 గంటలకు జూనియర్ కళాశాల ముగుస్తుంది. దాదాపు అదే సమయంలో హైస్కూల్ కూడా ముగుస్తుంది. తర్వాత విద్యార్థులు పొదిలి రోడ్డులోని పెట్లూరు, కోయవారిపాలెం, ధర్మవరం, వెంకటకృష్ణాపురం, అయ్యవారిపాలెం, జువ్విగుంట గ్రామాలకు చెందిన విద్యార్థులు తమ గ్రామాలకు వెళ్లాలంటే పొదిలి వైపు వెళ్లే బస్సులేక ఇబ్బందులు పడుతున్నారు. కొండపి బస్టాండ్ నుంచి ప్రతిరోజూ సాయంత్రం 3.30 గంటలకు కొండపి నుంచి జువ్విగుంట మీదుగా పొదిలికి ఆర్టీసీ బస్సు వెళ్తుంది. తర్వాత తిరిగి సాయంత్రం 5.30 గంటలకు పొదిలి నుంచి కొండపి ఆర్టీసీ బస్టాండ్‌కు పొదిలి నుంచి బస్సు వస్తుంది. 15 నిమిషాలపాటు బస్టాండ్‌లో బస్సు వేచి ఉంటుంది. 5.40 నుంచి 5.50 గంటల సమయంలో బస్సు బయలు దేరుతుంది. అప్పటి వరకు స్కూల్, కళాశాల వదిలాక విద్యార్థులు గంటన్నరపాటు బస్టాండ్‌లో వేచి ఉంటున్నారు. విద్యార్థులు అక్కడే హోం వర్క్ చేసుకుంటున్నారు. మగపిల్లలు అయితే ఫోన్‌లు చూసుకుంటూ, చెడు వ్యసనాల వైపు ఆకర్షితులవుతున్నారని, అదే స్కూల్ సమయం ముగిశాక తమ స్వస్థలాలకు వెళ్లేందుకు బస్సు ఉంటే వెంటనే విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోతారు కదా? అని పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ రూటులోని పెట్లూరు గ్రామం వరకు ఆటోలు తిరగుతుంటాయి. కనుక మధ్యలోని గ్రామాల విద్యార్థులు ఆటోలు ఎక్కి కొందరు వెళ్లి పోతున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 430 గంటల నుంచి 5 గంటల లోపు ఈరూటులో బస్సు కొండపిలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలు దేరితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని వారు అంటున్నారు. కందుకూరు డిప బస్సు కూడా సాయంత్రం కొండపి నుంచి విక్కిరాల పేట మీదుగా 3.50 గంటలకు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. ఈ రూటులో కూడా 4.30 నిమిషాల సమయంలో బస్సు కొండపిలో బయలు దేరితే దాదాపు 20 మంది విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని కళాశాల విద్యార్థులు తెలిపారు.



కొండపి ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న విద్యార్థినులు



కళాశాలలో ఇబ్బందులు వివరిస్తున్న విద్యార్థులు

అధికారులు స్పందించాలి



కందుకూరు, పొదిలి డిపోల అధికారులు స్పందించి పాఠశాల ముగింపు వేళలకు అనుకూలంగా బస్సులు ప్రయాణ వేళలు మార్చాలని కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ప్రతిరోజూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈవిషయాన్ని ప్రతి రోజూ తనకు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. దాదాపు గంటన్నర పాటు విద్యార్థులు కళాశాలను వదిలి, ఇళ్లకు వెళ్లకుండా బస్టాండ్‌లో వేచి ఉంటుంటే ఎటువంటి వ్యసనాలకు బలౌతారోనని ఆందోళనగా ఉందని ఆయన వాపోయారు. ఈనెలలో ఇపుడు సాయంత్రం 6 గంటలు అంటే పగటి వేళ ఉంటోంది. ముందు, ముందు రాబోయే రోజుల్లో నాలుగు నెలల తర్వాత సాయంత్రం 5 గంటలకే చీకటి పడిపోతుందని, అటువంటి కాలంలో విద్యార్థులు ఇళ్లకు ఎలా వెళ్లాలని భయపడుతున్నారన్నారు.

ఇది పొలం కాదు.. రోడ్డే..!

మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామంలో పొలాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. కనీసం నడిచేందుకు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. ఆ రోడ్డు పై వెళ్లాలంటే గ్రామస్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు మగాణిలా తయారవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఆ రోడ్డుపై పొలాలకు, మెయిన్‌రోడ్డుకు వెళ్లే మార్గం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి చెట్లు దట్టంగా పెరగడంతో అవస్థలు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

- మార్కాపురం రూరల్, ఆంధ్రజ్యోతి



అవీఇవీ

ఏ ఒక్క పొగాకు రైతు కూడా నష్టపోకుండా ఆదుకుంటాం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి హామీ ఇచ్చిన మంత్రి అచ్చెన్న



పొగాకు కొనుగోలుపై మంత్రి అచ్చెన్నతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు నియోజకవర్గంలోని రైతులు పండించిన తెల్లబర్లీ పొగాకును కొనుగోలు చేస్తామని, ప్రతి రైతు నష్టపోకుండా ఆదుకుంటామని వ్యవసాయ మంత్రి కే అచ్చెన్నాయుడు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి హామీ ఇచ్చారు. గిద్దలూరు నియోజకవర్గంలోని తెల్లబర్లీ పొగాకు అమ్మకాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రైతులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి గడిచిన 4 రోజుల కిందట తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అమరావతి వెళ్లి మంత్రి అచ్చెన్నను కలిసి పొగాకు రైతుల సమస్యలను వివరించారు. పొగాకు అమ్మకాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పొగాకును కొనుగోలు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి జీపీఏ అలియన్స్ కంపెనీ ప్రతినిధులతో ఆయన మాట్లాడి వెంటనే నియోజకవర్గంలోని పొగాకును కొనుగోలు చేయాలని ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మంత్రి అచ్చెన్నకు ధన్యవాదాలు తెలిపారు.

రారండోయ్..!

(5వపేజీ తరువాయి)

పోటీలు నిర్వహిచాలి. తండ్రులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించాలి. పిల్లలతో తల్లులకు వందనం పాదాభినందనం, పుష్పార్చన చేయించాలి. ఈ పోటీలను ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించాలి.

మధ్యాహ్న భోజనం మెనూ ఇదీ

మెగా పీటీఎం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అతిథులు, టీచర్లందరూ సహపంక్తి భోజనం చేయాలి. అందుకోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనానికి ప్రభుత్వం ప్రత్యేక మెనూ ప్రకటించింది. వెజిటబుల్ రైస్ పలావ్, అలుకుర్మా, ఉడికించిన గుడ్లు, రాగిజావతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి. భోజనం తీసుకున్న వారి వివరాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలు తీయాలి. ఈ కార్యక్రమం మొత్తానికి సంబంధించి మూడు మంచి ఫొటోలు, 30 సెకన్ల నిడివిగల వీడియోను లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

రేషన్‌కార్డు స్థానంలో స్మార్ట్ కార్డు

(5వపేజీ తరువాయి)

షాపుల పరిధిలో 6,61,187 రేషన్ కార్డులు ఉన్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం 9,347 మంది దరఖాస్తు చేసుకోగా ప్రస్తుతం ఉన్న కార్డుల్లో పేర్ల నమోదు కోసం 58,985 మంది అప్లై చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ వచ్చేనెలలో స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. అలా వచ్చేనెలలో సుమారు 6.70 లక్షల మందికి కొత్తగా స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ స్మార్ట్ కార్డులు కూడా గతంలో వలే పార్టీ రంగులు, ఇతర ముఖచిత్రాలు లేకుండా రూపొందించి కార్డుదారులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు.

సహకార శాఖలో ఏం జరుగుతోంది?

(5వపేజీ తరువాయి)

చేరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జిల్లా విజిలెన్స్ విభాగం అధికారులు సహకారశాఖ వ్యవహారంపై దృష్టి సారించారు. ఆశాఖ అధికారులు బుధవారం ఇక్కడి డీసీవో కార్యాలయానికి వెళ్లి ఆంధ్రజ్యోతి కథనం ఆధారంగా ఆశాఖలో ఏం జరుగుతుందన్న విషయంపై పలువురు ఉద్యోగులతో మాట్లాడినట్లు తెలిసింది. ఆ శాఖ విషయాలపై అవగాహన ఉండే ఇతర వ్యక్తుల నుంచి కూడా కొంత సమాచారం సేకరించిన వారు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు సమాచారం. జిల్లా సహకార శాఖలో పరిణామాల విషయం ప్రభుత్వంలో కీలకమైన మంత్రి నారా లోకేష్, సహకార శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు దృష్టికి కూడా వెళ్లినట్లు తెలిసింది. బుధవారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం సందర్భంగా జిల్లా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఈ విషయంపై సంబంధిత మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడినట్లు సమాచారం. మరోవైపు కీలకమని మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా వ్యవహారం వెళ్లినట్లు సమాచారం.

అన్నదాత సుఖీభవ జాబితాలు సిద్ధం

(5వపేజీ తరువాయి)

ప్రకటించారు. మొత్తం రూ.20వేలలో కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ రూ.6వేలు పోను మిగిలిన రూ.14వేలను అన్నదాత సుఖీభవ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. మూడు విడతలుగా కేంద్రం ఇచ్చే నగదుతో కలిపి ఇచ్చే ఈ పథకాన్ని ప్రభుత్వం తొలివిడత నగదు విడుదల ఆలస్యంతో వాయిదా పడింది. అతి త్వరలో కేంద్రం తొలి విడత నిధులు ఇవ్వనుండటంతో అదే రోజున రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ తొలివిడత నగదును జమ చేసేందుకు సిద్ధమైంది. అందుకు సంబంధించి అత్యంత కీలకమైన అర్హులైన రైతుల జాబితాలను ప్రకటించింది. జిల్లాలో వెబ్ ల్యాండ్ ఆధారంగా మొత్తం 5,31,369 మంది రైతు కమతాలు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 2,67,003 మందికి ఈకేవైసీ పూర్తి చేశారు. మరో 6,507 మంది అర్హులైన వారు మృతి చెంది లేదా ఇతర దేశాలు, రాష్ట్రాలలో ఉండి అందుబాటులోకి రాని వారిగా గుర్తించారు. ఇంకొక 1,249 మందికి ఈకేవైసీ చేయల్సి ఉంది. ఈ మొత్తం రైతు వారీ జాబితాలను ఉన్నతాధికారుల అదేశాలతో జిల్లాలో 616 రైతు సేవా కేంద్రాల్లో బుధవారం వ్యవసాయశాఖ సిబ్బంది ప్రచురించారు. స్థానికంగా రైతులు ఆ కేంద్రాలకు వెళ్లి తమ పేర్లు జాబితాలో ఉన్నదీ లేనిదీ చూసుకోనే అవకాశం కల్పించారు. వెబ్‌సైట్‌లోనూ పరిశీలన చేసుకోనే సౌకర్యం కల్పించారు. ఈ జాబితా ఆధారంగా త్వరలో అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ తొలివిడత నగదు జమ అయ్యే అవకాశం ఉంది.

ఎక్కువమంది రైతులకు వ్యవసాయ పరికరాలు

ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ సబ్‌మిషన్ పథకం కింద రైతులకు వ్యక్తిగత పనిముట్లను 2025-26లో ఎక్కువ మందికి అందేలా చూడాలని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆగ్రోస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళగిరి సమీపంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జిల్లాల వారీగా ఆగ్రోస్ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఆగ్రోస్ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో పాటు కోర్టు కేసులు, బకాయిలు, సంస్థ స్థలాల పరిరక్షణ, వ్యవసాయ పరికరాల అమ్మకం తదితర అంశాలపై చర్చించారు.

ఎరువుల సరఫరాలో కోత లేదు: అగ్రి డైరెక్టర్

రాష్ట్రానికి ఎరువుల సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కోతలైె విధించలేదని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు స్పష్టంచేశారు. ఖరీఫ్ సీజన్‌లో 16.76లక్షల టన్నుల ఎరువులు కేటాయించగా, జూన్ నెలాఖరు నాటికే 5.64లక్షల టన్నులు రాష్ట్రానికి వచ్చినట్లు బుధవారం తెలిపారు.

ప్రాజెక్ట్ లీడ్ ఏజెన్సీగా రైతు సాధికార సంస్థ

అమరావతి, జూలై9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరువు అనుసరణ, ఉపశమనం ద్వారా ప్రకృతి దృశ్య స్థాయి వ్యవసాయ పర్యావరణ పరివర్తన ప్రాజెక్ట్ అమలుకు లీడ్ ఏజెన్సీగా ఏపీ రైతుసాధికార సంస్థను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో ముగ్గురు అదనపు డైరెక్టర్ల తుది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానశాఖలో 1,2 స్థాయి గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఆ శాఖ డైరెక్టర్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. పట్టు పరిశ్రమశాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ కేటగిరిలో 2017 నుంచి ప్రొబేషన్‌లో ఉన్న ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించి, ఇప్పటికే రిటైరైన వారికి కోర్టు ఆదేశాల మేరకు పెన్షన్ ప్రయోజనాలు కల్పించేలా ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే లేబర్ కోడ్స్ అమలు

వివిధ రంగంలోని కార్మికులకు గుర్తింపు ఇవ్వాలి
సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
దేశ ప్రయోజనానికి వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధవామపక్ష సంఘాల నేతలు, కార్మికులు, ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్,జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీప్రభుత్వం స్వదేశీ, విదేశీ పెట్టుబడుల ప్రయోజనాల కోసం కార్మికుల చట్టాలను లేబర్‌కోడ్స్‌కు తెస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మండిపడ్డారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాలు నిర్వహించిన ధర్నాకు ఏఐటీయూసీ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస రావు, సీఐటీయూ నగర కార్యదర్శి మహేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఉద్యోగ కార్మికులను రెగ్యూలర్ చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించలాన్నారు. దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు, కార్మిక, శ్రామికులు పెద్దఎత్తున సమ్మెలో పాల్గొంటున్నందున ఇప్పటికైనా ప్రభుత్వాలు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, విద్యుత్, రవాణా, బ్యాంకు, ఇన్సూరెన్స్, టెలిఫోన్, స్టీల్‌ప్లాంట్లు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కళ్లు తెరిచి కార్మికుల చట్టాలను కొనసాగించాలని లేనిపక్షంలో తగిన మూల్యం తప్పదని రామకృష్ణ హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎంఎస్‌సాయిలు మాట్లాడుతూ జిల్లాలో సంక్షోభంలో ఉన్న గ్రానైట్ డిజైన్‌ప్లేట్లు, ఇతర పరిశ్రమలకు రాయితీలు ఇవ్వాలన్నారు. ఒంగోలులో ఈఎస్‌ఐ హాస్పటల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, కిసాన్ మోర్చా కన్వీనర్ చుండూరి రంగరావు, వివిధసంఘాలనేతలు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు, ఆర్. వెంకట్రావు, అయ్యప్పరెడ్డి చిరంజీవి, కృష్ణమోహన్, ఈదర అన్నపూర్ణ, ఆర్. రాజ్యలక్ష్మీ, రాజేష్, రత్నాకర్, శ్రీనివాసరావు, రమణయ్య, పారా శ్రీనివాసరావు, తాళ్ళూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత ఆర్టీసీ బస్టాండు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

కక్షిదారులు సమస్యల పరిష్కారానికి మెరుగ్గా చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వం అనేది భవిష్యత్ రోజుల్లో కక్షిదారుల మధ్య సమస్యల పరిష్కారానికి మెరుగ్గా పనిచేస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఏ భారతి చెప్పారు. స్థానిక జిల్లా న్యాయస్థానంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగిన మీడియేషన్ ఫర్ నేషన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి భారతి మాట్లాడుతూ మీడియేషన్ ఫర్ నేషన్ సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వేదిక అని అన్నారు. ఈ కార్యక్రమం గురువారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. శిక్షణ ముగించిన న్యాయవాదులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు వారికి అప్పగించిన మీడియేషన్ వ్యాజ్యాలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు దోహదపడుతుందన్నారు. న్యాయవాదులకు, ఇతరులకు శిక్షణ ఇచ్చిన న్యాయవాది ఎస్. అరుణచలంను అభినందించారు. ఈకార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి. రాజ్యలక్ష్మీ, పి. లలిత, పూర్ణిమ, జి. దీన, టీ రాజావెంకటాద్రి, సీనియర్ న్యాయమూర్తులు ఎస్. హేమలత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన మీడియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్హులకు స్థలాలు కేటాయిస్తాం : కందుల


సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న ప్రజలు

పొదిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం వక్ఫ్‌బోర్డు స్థలాల్లో అక్రమకట్టడాలను అధికారులు తొలగించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే కందుల బుధవారం నిర్మాణాలు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఉన్నట్టుండి ఇక్కడి నుంచి వెళ్లమంటే ఎలాగని మహిళలు ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కందుల మాట్లాడుతూ అవి ప్రభుత్వ స్థలాలు కాదని, వక్ఫ్‌బోర్డు భూములని, అక్కడ ఉండడం సరికాదని తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకే అధికారులు చర్యలు చేపట్టారన్నారు. అర్హులైన పేదలకు వేరేచోట స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చేపల మార్కెట్ కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ క్రిష్ణారెడ్డి సిబ్బంది ఉన్నారు.

అనధికార మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలి

ఒంగోలు క్రైం, జూలై 9(ఆంధ్రజ్యోతి): అనధికార మద్యం విక్రయాలకు అడ్డుకట్టవేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే హేమంత్ నాగరాజు కోరారు. బుధవారం స్థానిక డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆయేషాబేగం మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న మద్యం దుకాణాలలో ఎంఆర్‌పీ ఉల్లంఘనా జరగకుండా చూడాలన్నారు. నాటుసారా, ఇతర రాష్ట్రాల మద్యం విక్రయాలు జరగకుండా అరికట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌లు వెంకట్, ఏ జనార్దనరావు పాల్గొన్నారు.

పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌ను కలిసిన సీపీఐ రామకృష్ణ


రామకృష్ణను సన్మానిస్తున్న సీతారామయ్య

ఒంగోలు విద్య, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రమకృష్ణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలులోని సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు వచ్చిన రామకృష్ణ బ్యాంకు చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సీతారామయ్య నేతృత్వంలో బ్యాంకు పూర్వ వైభవం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ఈసందర్భంగా డాక్టర్ సీతారామయ్య సీపీఐ రామకృష్ణను శాలువతో సత్కరించారు. కాగా టంగుటూరుకు చెందిన వ్యాపారవేత్త కామని రామయ్య పెద్ద ఖర్మకు హాజరైన డాక్టర్ సీతారామయ్య ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

జిల్లాలో 14.0 మి.మీ వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి మంచి వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 14.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. పొదిలి మండలంలో అత్యధికంగా 45.6 మి.మీ.వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా ముండ్లమూరు మండలంలో 3.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. బేస్తవారిపేట 36.4, చీమకుర్తి 34.4, మద్దిపాడు 31.2, కంభం 30.8, హనుమంతునిపాడు 26.8, కొత్తపట్నం 26.4, కొనకనమిట్ల 25.2, సంతనూతలపాడు 24.8, ఒంగోలు రూరల్ 24.2, ఒంగోలు అర్బన్ 24.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొండపి 19.8, తర్లుబాడు 19.2, కనిగిరి 17.6, వెలిగండ్ల 14.2, పీసీపల్లి 11.4, పామూరు 10.8, తాళ్లూరు 10.6, జరుగుమల్లి 10.6, టంగుటూరు 10.4, మార్కాపురం 10.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా ఇతర మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

విమానాశ్రయ సాధ్యాసాధ్యాల నివేదికకు టెండర్లు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి చొరవతో అల్లూరు-ఆలూరు గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న విమానాశ్రయం ఏర్పాటుకు ఫిజిబిలిటీ రిపోర్టుకు టెండర్లను పిలిచారు. విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించి దాని ఏర్పాటుపై తుది నివేదిక ఇస్తామని బృందం తెలిపిందని మాగుంట తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ఫిజిబిలిటీ రిపోర్టు(సాధ్యత నివేదిక) తయారు చేసేందుకు సలహాదారు(కన్సల్టెంట్) ఎంపికకు ఆంధ్రప్రదేశ్ ఎయిర్ పోర్టుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు మంగళవారం ప్రకటన ఇచ్చారన్నారు. ఆసక్తిగల సలహాదారులు ఈనెల 29వ తేదీలోపు వారి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని చెప్పారు. తుది నివేదిక వచ్చిన వెంటనే విమానాశ్రయ నిర్మాణంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఎంపీ తెలిపారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం.. వ్యక్తి అరెస్టు


బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

గిద్దలూరు టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలు అక్రమంగా కలిగి ఉన్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 10 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మండలంలోని సంజీవరాయునిపేట గ్రామంలో మద్యం అక్రమంగా కలిగి ఉన్నారని సమాచారం రావడంతో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయరావు, సిబ్బంది దాడి చేసి 10 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో సిబ్బంది శ్రీపతి వెంకటేశ్వర్లు, హరిబాబు, శంకర్, ఆషదుల్లా పాల్గొన్నారు.

అలా వచ్చారు.. ఇలా వెళ్లారు!

వైసీపీ నేతల ఆక్రమిత భూములపై తూతూమంత్రంగా అధికారుల సర్వే
నెలలతరబడి అదే తంతు
ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశాలతో భూ కొలతలు చేపట్టిన డీఈఎస్


రాళ్లవాగు ప్రాంతంలో హద్దులు చూస్తున్న సర్వేయర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను కాపాడి వాటిని రక్షించాల్సిన రెవెన్యూ అధికారులే ఆక్రమితదారులకు వత్తాసు పలుకుతున్నారు. కొంత మంది సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు భూ రికార్డులను తారుమారు చేస్తూ ఆక్రమార్కులకు సహకరిస్తున్నారు. ఎర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు వెళ్లే రహదారిలోని సర్వే నెంబరు 28, 28-1లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు సుమారు పది ఎకరాల వరకు ఆక్రమించుకొని భవనాలు నిర్మించడంతోపాటు కొంత భూమిలో వెంచర్లు వేశారు. దీనిపై ఈనెల 5న అంతా భూటకం...బోర్డుతో నాటకం..! అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ స్పందించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఎన్.నాగేశ్వరరావును ఆ ప్రాంతాన్ని పరిశీలించి, కొలతలు వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆ సర్వే నెంబరులోని భూములను త్రిపురాంతకం మండల సర్వేయర్లతో కొలతలు వేయించారు.

ఆక్రమణలపై నోరు మెదపని డీఈఎస్

ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు డీఈఎస్ నాగేశ్వరరావు కేవలం 28, 28-1సర్వే నంబర్లలో ఉన్న భూములకు మాత్రమే కొలతలు వేసి వెళ్లిపోయారు. మిగిలిన సర్వే నెంబర్లు 600, 587-2లో కబ్జాకు గురైన భూముల జోలికి వెళ్లకపోవడం గమనార్హం. సర్వే చేసిన అధికారి ఆ సర్వే నంబర్ల భూములపై నోరుమెదపకుండా వెళ్లిపోవడం గమనార్హం. అయితే డీఈఎస్ ఫిర్యాదిదారులతో మాట్లాడుతూ భూ ఆక్రమణ జరిగిన రెవెన్యూ భూముల వరకు మాత్రమే సర్వే చేసి కొలతలు వేశామని, ఆ నివేదికను ఇన్‌చార్జి కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. మిగిలిన భూములు ఇరిగేషన్ పరిధిలోకి వస్తాయని, ఆ భూములకు సంబంధించి ఆ శాఖ అధికారుల ఆధ్వర్యంలో గురువారం కొలతలు వేస్తామని చెప్పారు.

సర్వే రిపోర్టే ఇవ్వలేదు

ఈనెల 5న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం నిజమేనని ఎట్టకేలకు తేలింది. కలెక్టర్‌కు ఈ ప్రాంతవాసులు లక్ష్మీనారాయణ, సాలమ్మ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఏప్రిల్ 9న డిప్యూటీ కలెక్టర్, ఒడా అధికారులు విచారణకు ఎర్రగొండపాలెం వచ్చారు. ఆ సమయంలో అందుకు సంబంధించి రిపోర్టు ఇవ్వాలని ఆ సర్వేయర్‌ను ఆదేశించినా ఇటు కార్యాలయంలోగానీ, జిల్లా అధికారులకు గాని ఇవ్వలేదని బుధవారం స్పష్టమైందని ఇటు ఫిర్యాదుదారులు అటు మండల సర్వేయర్ తెలిపారు. ఇదిలా ఉంటే సర్వే కోసం వచ్చిన డీఈఎస్ మండల సర్వేయర్‌లతో పాటు ఆ సచివాలయ సర్వేయర్ కూడా వచ్చారు. ఆ సర్వేయర్ ఉంటే పూర్తి స్థాయిలో రిపోర్టు రాదని కొలతల విషయంలో తారుమారు చేస్తారని వారికి విన్నవించారు. దీంతో ఆ సర్వేయేర్‌ను అక్కడి నుంచి పంపించారు. స్థానిక సర్వేయర్లతో కాకుండా త్రిపురాంతకం మండల సర్వేయర్లతో ఆక్రమిత భూములను కొలతలు వేయిస్తున్నట్లు ఆయన ఫిర్యాదుదారులకు వివరించారు. సర్వే రిపోర్టులు ఇవ్వని సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, మండల సర్వేయర్‌లను కోరారు. ఏదేమైనా ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించే విషయంలో స్థానిక అధికారులు ఏమేరకు చర్యలు తీసుకుంటారో అన్నది ప్రశ్నగానే మారింది.

ఖాతాలకు జమ కాని కాంపోజిట్ స్కూలు గ్రాంటు

జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్ల బ్యాంక్ ఖాతాలకు ఈకేవైసీ చేయించకపోవడమే కారణం
హెచ్‌ఎంల సొంత డబ్బులతో పీటీఎం ఖర్చులు

ఒంగోలు విద్య, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు ద్వారా విడుదలైన రూ.2.91 కోట్లు పాఠశాలల బ్యాంకు ఖాతాలకు జమకాలేదు. పాఠశాలల్లో గురువారం జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ఖర్చులకు ప్రధానోపాధ్యాయులు తమ స్వంత నిధులనే వినియోగించాల్సి వస్తోంది. మెగా పీటీఎం ఖర్చుల కోసం పాఠశాలలకు 50శాతం కాంపోజిట్ స్కూలు గ్రాంటు నిధులు విడుదల చేశారు. సాంకేతికలోపంతో అవి జమ కాలేదు. 2,291 పాఠశాలలకు 2022-23 విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య ఆధారంగా 587.6 కోట్లకు ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు ఆమోదం తెలిపింది. 24 పాఠశాలల్లో పిల్లలు లేక మూతపడడంతో 2271 పాఠశాలలకు మాత్రమే నిధులు విడుదల చేయాల్సి ఉంది. వీటిల్లో 16 పాఠశాలలకు బ్యాంకు ఖాతాలకు కేటాయించిన నెంబర్లు అందుబాటులో లేకపోవడంతో 2255 పాఠశాలలకు రూ.2.91 కోట్లు విడుదల చేశారు. అయినా ఈ నిధులు పాఠశాలల ఖాతాలకు జమ కాలేదు. సమగ్ర శిక్ష నిధులు యూనియన్‌బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. జిల్లాలోని పాఠశాలలన్నీ కాంపోజిట్ స్కూలు గ్రాంటుకు యూనియన్ బ్యాంకులోనే ఖాతాలు ఉన్నాయి. ఈ ఖాతాలు గత ఆరు నెలలుగా లావాదేవీలు జరపకపోవడంతో ఆ ఖాతాలను ఇన్‌ఆపరేటివ్‌గా ప్రకటించింది. మళ్లీ లావాదేవీలు జరపాలంటే మళ్లీ ఆ ఖాతాలకు ఈకేవైసీ చేయించాలి. ఈకేవైసీ చేయించుకోని కారణంగా ఈ ఖాతాలకు నిధులు జమ కాలేదు. దీనికి తోడు ఇటీవల టీచర్ల బదిలీలతో పాటు పాఠశాలలకు కొత్తగా హెచ్‌ఎంలుగా వచ్చిన వారు బ్యాంకు ఖాతాలు తమ పేరుతో మార్పించుకోవాలి. బ్యాంకులో నిధులు సిద్ధంగా ఉన్నట్లు బ్యాంకు ఉన్నతాధికారులు ఒక లేఖ ఇవ్వాల్సి ఉంది. దీని కోసం ఇక్కడి సమగ్ర శిక్ష అధికారులు రాష్ట్ర కార్యాలయానికి కూడా లేఖ రాశారు. ఇదిలా నడుస్తుండగా బుధవారం బ్యాంకు ఉద్యోగుల సమ్మెతో బ్యాంకులు స్తంభించాయి. దీంతో బుధవారం కూడా ఖాతాలకు డబ్బులు జమకాకపోవడంతో హెచ్‌ఎంలే తమ స్వంత నిధులతో పీటీఎంలకు ఖర్చు పెడుతున్నారు.

పేదల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

- ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ సత్య
- గుర్రప్పడియ గ్రామంలో తొలిఅడుగు ప్రచారం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సత్య

కొండపి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సీఎం చంద్రబాబు కష్టపడుతున్నారని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి మండలంలోని గుర్రప్పడియ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గృహయజమానులతో మాట్లాడారు. ఇంటింటికీ అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలో డబ్బులు తిరిగి అకౌంట్‌లకు జమ అవుతున్నాయా? తల్లికి వందనం డబ్బులు అందరు పిల్లలకు పడ్డాయా? పెంచిన పింఛన్ డబ్బులు అందుతున్నాయా? పథకాల అమలు తీరును సత్య అడిగి తెలుసుకున్నారు. సంతృప్తిగా ఉన్నామని పలువురు వివరించారు. త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు పడతాయని రైతులకు, కౌలు రైతులకు తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు సీఎం చంద్రబాబు అమలు చేస్తానని ప్రకటించాడని, మహిళలు ఇకపై టికెట్ లేకుండా తమ పనుల కోసం ఉచిత ప్రయాణాలు చేయవచ్చన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన సభలో సత్య మాట్లాడుతూ 2014 -19 మధ్యకాలంలో గ్రామ టీడీపీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ మారెడ్డి సుబ్బారెడ్డి గ్రామాభివృద్ధికి రోడ్లు నిర్మిస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు ఆబిల్లుల డబ్బులు వాడుకుని ఇబ్బందుల పాల్జేశారని సత్య గుర్తు చేశారు. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందుతాయని, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, నాయకులు పోటు శ్రీనివాసరావు, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, కొర్రపాటి వసంతరాయుడు, చాగంరెడ్డి నరసారెడ్డి, గుండపనేని రామ్మూర్తి నాయుడు, రావూరి కొండయ్య గుర్రప్పడియ గ్రామ తెలుగు యువత నాయకుడు మారెడ్డి అబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

మద్దిపాడు, జూలై9(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం మద్దిపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ఆసుపత్రిలోని అన్ని గదులను, ఎన్‌టీఆర్ వైద్య సేవ కౌంటర్‌ను, ఓపీలను, అత్యవసర సేవా విభాగాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో ఉద్యోగ సిబ్బంది జాబ్‌చార్టును అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రసవాలకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించి అందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులతో మాట్లాడారు. వైద్యసేవల గురించి ఆరా తీయగా సక్రమంగానే అందుతున్నట్లు రోగులు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి, డాక్టర్ అన్వేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాల స్వచ్ఛీకరణకు చర్యలు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్వో వరకుమార్

చీమకుర్తి, జూలై9(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని రాజకీయపార్టీల ప్రతినిధులు, తహసీల్దార్‌లతో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వరకుమార్ సమావేశమయ్యారు. ఓటర్ల సవరణ, నూతన ఓటర్ల చేరికలు, అర్హత లేనివారివి తొలగింపులు తదితరాలకు పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ పక్కాగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బ్రహ్మయ్య, నారాయణరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'సుపరిపాలనలో తొలిఅడుగు'



కరపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

చీమకుర్తి, జూలై9(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం చీమకుర్తి పట్టణంలో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. క్రిస్టియన్‌పాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, శేషారావు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, ఏడుకొండలు, పాటిబండ్ల భిక్షాలు, కర్ణా ప్రసాదు పాల్గొన్నారు.

ఎల్ఐసీని పరిరక్షించుకోవాలి



ధర్నాలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు(రూరల్), జూలై9(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఐసీఈయూ కార్యదర్శి పారా శ్రీనివాసరావు కోరారు. సార్వత్రికసమ్మెలో భాగంగా బుధవారం ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉద్యోగులు, ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. దానిని కాపాడుకోవటానికి ఎలాంటి ఉద్యమాలకు, త్యాగాలకు వెనుకాడబోమని చెప్పారు. కార్యక్రమంలో బి.కేశవరావు, మల్లికార్జున రావు, శరత్‌చంద్ర, డి.విద్యాసాగర్, సత్యమూర్తి, విజయశేఖర్, రామ్‌గోపాల్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న బసవపున్నయ్య

నాగులుప్పలపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తూబాటి శ్రీకాంత్ సీఐటీయూ మండల కార్యదర్శి జి.బసవపున్నయ్య డిమాండ్ చేశారు. కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలో ధర్నా నిర్వహించారు. లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నలతోటి రామారావు, కాకాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుంతలతో గందరగోళం

● వాహనదారుల అవస్థలు



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు

ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులో గల జాతీయరహదారి ఫ్లైఓవర్ కింద తారు రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఈ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా ఒంగోలు నగరంలోని వాహనదారులు గుంటూరు, నెల్లూరు వైపు జాతీయరహదారి నుంచి ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. అలాగే కొత్తపట్నం, ఒంగోలు మండలంలోని పలు గ్రామాలకు వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. ఈక్రమంలో ప్రతిరోజు వాహనదారులు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు అనేకం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే దామచర్ల



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని 30, 32వ డివిజన్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకోగా కొందరు పింఛన్లు, ఇంటి స్థలాలు, రేషన్‌కార్డుల లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయా డివిజన్లలోని సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వాటిని సత్వరమే పరిష్కరించాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. తాను కూడా డివిజన్‌లలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి, అవసరమైన పథకాలు అందరికీ చేయాలన్నదే లక్ష్యమన్నారు. పేదరికం లేని సమాజ స్థాపన కోసం ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తుందని వివరించారు. గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఇంట్లో ఒక పిల్లవాడికే డబ్బులు ఇవ్వగా నేడు తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.13వేలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, పింఛన్లు పెంపు తదితర పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల కోసం అర్హులు తమ దరఖాస్తులను సచివాలయంలో అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు నత్తల కనకరావు, నత్తల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ తూము సుబ్బారావు, కంకణాల వెంకట్రావు, ఆరిగ శంకర్, ఆరిగ శైలజ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బీఎన్



దుకాణదారుడికి కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఒమ్మెవరంలో జరిగిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే బీఎన్ ముఖ్యఅతిథిగా హాజరై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఆయన ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి ప్రజలతో మమేకమై ఇంటింటికి వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలయిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలయిందని, సామాజిక పింఛన్లు పెంచడానికి ఐదేళ్ళ పట్టిందని, కూటమి ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం పింఛన్లు ఒక్కసారిగా పెంచి అందిస్తున్నామని తెలిపారు. కుటుంబంలో ఎందరు పిల్లలుంటే అంతమందికి అమ్మకు వందనం పథకం ద్వారా నగదు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలను అభివృద్ధి వైపు పరుగులు తీసేలా సీఎం చంద్రబాబు పీ4ను విజయవంతంగా అమలు చేస్తున్నారని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మంచి ప్రభుత్వానికి ప్రజలు ఎల్లప్పుడు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గ్రామ అధ్యక్షుడు కొమ్మాలపాటి సురేష్, సర్పంచ్ పాలపర్తి బాలకోటి, కొమ్మినేని రమేష్, కల్లూరి రామారావు, కోటేశ్వరరావు, పిట్టా అంజి, పిన్నక సుబ్బారావు, వాసుమల్లి నాగార్జున, పీకా బైరాగి, కనగాల శ్రీనివాసరావు, సెల్వం, మెట్టు సుబ్బయ్యనాయుడు, తెలగతోటి జాన్సన్, మండవ వెంకటేశ్వర్లు, అంకిరెడ్డి, కుర్రా వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్‌బాబు



ఉప్పుగుండూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రజియాసుల్తానా

సంతనూతలపాడు, జూలై9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు. ఎండ్లూరు డొంక సమీపంలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో విద్యార్థినులకు బుధవారం జరిగిన అవగాహన సదస్సులో సీఐ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు తమ భద్రత కోసం తప్పనిసరిగా శక్తియాప్‌ను, అదేవిధంగా డయల్ 100ను వినియోగించుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో తెలియని వ్యక్తులతో పరిచయాలు అనుమతించవద్దని, దానివల్ల అనేక ఇబ్బందులు పడతారని తెలిపారు. డిజిటల్ అరెస్టులు, బ్యాంకులలో జరిగే మోసాలపై వివరించారు. సైబర్‌నేరం జరిగిందని తెలిస్తే వెంటనే 1930కు డయల్ ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.అజయ్‌బాబు, ఏవో చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌమ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కాలేజీలో..

ఒంగోలు క్రైం: విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తాలుకా సీఐ వి జయకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని ప్రతిభ కాలేజీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకొని తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ఏదైన అత్యవసర పరిస్థితి ఉంటే సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు లేదా 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రజియాసుల్తానా సూచించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌పై బుధవారం ఆమె అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీభవానీ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలను పరిష్కరించాలి

● సమ్మెలో పాల్గొన్న కార్మికులు

● ప్రభుత్వ కార్యాలయాల మూసివేత



కొత్తపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు

కొండపి, జూలై9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పని గంటలు తగ్గించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు పది లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలన్న డిమాండ్‌లతో కార్మికులు బుధవారం చేపట్టిన సమ్మె కార్యక్రమం విజయవంతమైంది. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, ఆశా వర్కర్స్ యూనియన్, రైతు, రైతు కూలీ సంఘాల నాయకులు పాల్గొని ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. ఈసందర్భంగా బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూసి వేశారు. బస్టాండ్ సెంటర్ నుంచి టంగుటూరు రోడ్డు వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్, ఐఎఫ్‌టీయూ మండల నాయకుడు వై. చంద్రశేఖర్, ఆంధ్ర ప్రగతిశీల మహిళా జిల్లా నాయకురాలు భారతి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్‌ల నాయకురాళ్లు ఆదిలక్ష్మి, నిర్మల, సరళ, విజయలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.



కొండపిలో సమ్మె నిర్వహిస్తున్న కార్మికులు, సంఘాల నాయకులు

పొన్నలూరు: ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పొన్నలూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం కార్మికులు నిరసన చేపట్టారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని నినాదాలు చేశారు.

కొత్తపట్నంలో..

కొత్తపట్నం: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపట్నంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.రమాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాన్ పిక్ ప్రాజెక్టు కోసం కేటాయించిన భూముల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పి.పద్మ, నిర్మల, వెంకాయమ్మ, భూలక్ష్మి, నాగమల్లేశ్వరి, కృప, బ్రహ్మయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు దాసోహం

సంతనూతలపాడు: కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దాసోహమయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు ఆరోపించారు. కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం సంతనూతలపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. కార్మికవర్గం పోరాడి సాధించుకుని 8గంటల పనిదినాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, అంగనవాడీ, ఆశ వర్కర్ల చేత వెట్టిచాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్లకు బి సర్టిఫికెట్

ఒంగోలు విద్య, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 40 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు తమ ప్రతిభను చాటారు. ఎన్‌సీసీలో బి సర్టిఫికెట్ల కోసం జరిగిన రాతపరీక్షకు హాజరైన వీరు ఎ ప్లస్ గ్రేడ్‌లో ఉత్తీర్ణులై బి గ్రేడ్ సాధించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు సి సర్టిఫికెట్‌కు అర్హత పొందుతారు. బి సర్టిఫికెట్ సాధించిన వారు అగ్నివీర్ ద్వారా ఆర్మీలో ఉద్యోగాలు సాధించేందుకు వీలుటుందని ఎన్‌సీసీ విభాగాధిపతి రమణయ్య బుధవారం తెలిపారు. 34వ ఆంధ్రా బెటాలియన్ ఒంగోలు వారు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ గాయత్రి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, హెచ్‌వోడీలు, డీన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు రాయితీలు : ఏవో

నాగులుప్పలపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా రైతులకు కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఏవో డి.సంధ్య సూచించారు. ఉప్పుగుండూరు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ నీటి వసతి, బిందు సేద్యం ఉన్న రైతులు ఉద్యానశాఖ పథకాలకు అర్హులని చెప్పారు. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీని మొదటి ఏడాది, మిగిలిన 40 శాతం రెండో ఏడాది రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. హైబ్రీడ్ కూరగాయలు సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.9600, పూల తోటలు సాగు చేసే వారికి ఎకరానికి రూ.8వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

పొన్నలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు అన్నారు. సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంపై బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ తొలిఏడాదిలోనే తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, పింఛన్ల పెంపు లాంటి హామీలను నెరవేర్చామ న్నారు. మండలంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మిగిలిన సూపర్‌సిక్స్ హామీలను కూడా త్వరలో అమలుచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. వీటన్నిటి గురించి పార్టీనేతలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయాలని సాంబశివరావు సూచించారు.

బీఎల్‌వోలకు ముగిసిన శిక్షణ



బీఎల్‌వోలతో ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు (రూరల్), జూలై9(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌లో బుధవారం ఎన్నికల జాబితా నిర్వహణపై 50మంది బీఎల్‌వోలకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సమయంలో బీఎల్‌వోలు బాధ్యతగా వ్యవహరించటం ఎంతో అవసరమన్నారు. అదేవిధంగా 18సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకులకు ఓటుహక్కు కల్పించాలని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పక ఆచరించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ పి.మధుసూదనరావు, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

- పొన్నలూరు: ఓటరు జాబితాల నిర్వహణపై మండలంలోని బూత్‌లెవల్ అధికారులకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. కొండపి ఎలక్టోరల్ అధికారి ఏ.కుమార్, తహసీల్దార్ పుల్లారావు శిక్షకులుగా వ్యవహరించారు.

13న చీమకుర్తిలో ఉచిత కంటి వైద్యశిబిరం



వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

చీమకుర్తి, జూలై9 (ఆంధ్రజ్యోతి): శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న బూచేపల్లి కమలాకరరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఈనెల 13న చీమకుర్తిలోని బీవీఎస్‌ఆర్ కళ్యాణమండపంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన విషయాలను బుధవారం చీమకుర్తిలో జరిగిన సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి వివరించారు. గత పదేళ్లుగా బూచేపల్లి కమలాకరరెడ్డి పేరున చీమకుర్తిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని పేదప్రజల సౌకర్యార్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంతమంది శిబిరానికి విచ్చేసినా అందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేయటమే కాకుండా అవసరైన వారికి ఆపరేషన్లు కూడా తమ ఖర్చులతో చేయిస్తామన్నారు. వైద్యశిబిరానికి హాజరయ్యే వారు ఆధార్, రేషన్‌కార్డు లేదా ఏదైన ఇతర గుర్తింపుకార్డు తీసుకురావాలని కోరారు. షుగరు, గుండెజబ్బులున్న వారు తమ మెడికల్ రిపోర్టులు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పమిడి వెంకటేశ్వర్లు, క్రిస్టిపాటి శేఖరరెడ్డి, శేషాద్రి, గంగయ్య, బీమన వెంకట్రావు, తెల్లమేకల గాంధీ, మణెమ్మ, గోపవరపు చంద్ర, బాష పాల్గొన్నారు.

బ్యాంక్ అకౌంట్ల పేరుతో అంగన్‌వాడీ టీచర్ మోసం

ఒంగోలు క్రైం, జూలై9(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ అకౌంట్‌ల పేరుతో మోసం చేసిన అంగన్‌వాడీ టీచర్, మరికొందరిపై చర్యలు తీసుకోవాలని ఒంగోలు నగరంలోని పీర్లమాన్యంనకు చెందిన జయబున్ బుధవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పీర్లమాన్యంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న ఖాదర్‌ఉన్నీసా, ఆయా కుమారుడు నాయబ్‌రసూల్ కలిసి తనతో పాటు తమ కాలనీలో ఉంటున్న వారిని మోసం చేసి బ్యాంక్‌అకౌంట్‌లు ప్రారంభించి వారి వ్యాపారాలకు రుణాలు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నేడు గురు పౌర్ణమి

పెద్దారవీడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చట్లమిట్టలోని సాయినాథుని సన్నిధి గురువారం గురుపౌర్ణమి వేడుకలకు సర్వం సిద్ధమైనట్లు దేవస్థానం ఆధ్యాత్మిక సలహాదారు బండి మల్లికార్జున్ తెలిపారు. గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా ఉదయం కాగడ హారతి, గణపతి పూజ, ప్రాతకాల పూజలు, పుణ్యాహవాచనం, అభిషేకం, క్షీరాభిషేకం, సహస్ర నామ పుష్పార్చనలు, మంత్ర పుష్పం వంటి దేవతార్చనలు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం హారతి అనంతరం అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం గ్రామంలో సాయిబాబా రథోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా కృపకు పాత్రులు కావాలని కోరారు.



4వ వార్డులో కరపత్రాలను పంచిపెడుతున్న ఎమ్మెల్యే కందుల



సంఘం తాండాలో పథకాలను వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు

ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసిందని, ప్రజా ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల పాంప్లెట్లు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు తొలి ఏడాదిలోనే ఇచ్చిన హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేశారని, సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, అలాగే అన్న క్యాంటీన్లు, పెన్షన్ల పెంపు, డీఎస్సీ నోటిఫికేషన్ వంటివి అమలు చేశారన్నారు. సంవత్సర కాలంలోనే రాష్ట్రానికి బహుళజాతి కంపెనీలను తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగ కల్పన చేశారన్నారు. గత వైసీపీ పాలకులు పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రజలను మోసగించారన్నారు. వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాన్ని శ్రేణులు తిప్పికొట్టాలని కందుల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి
ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం : చెప్పిన హామీలు నెలరవేరుస్తూ ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని సంఘం తాండాలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పనిచేసే ఇటువంటి మంచి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. ఎన్ని సంక్షోభాలు ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు నెరవేరుస్తున్న సంగతిని గుర్తుచేసుకోవాలన్నారు. పింఛన్‌ల పంపిణీలో గతంలో ఎన్నడూ చేయని విధంగా సెలవు వస్తే 1వ తేదీకి ముందురోజే ఇస్తున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యంగా త్రిపురాంతకం మండలంలో పలు పనుల కోసం తాను పలు ప్రతిపాదనలు చేశానని వాటన్నిటికి సీఎం సానుకూలంగా ఉన్నారని త్వరలోనే నిధులు రాబట్టి అభివృద్ధి ద్ది పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. అనంతరం ఎరిక్షన్‌బాబును గ్రామస్థులు సన్మానించారు.



బాలింతలు, గర్భిణులకు భోజనం అందిస్తున్న సభ్యులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పెద్ద దోర్నాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెంటు నాగమహేశ్వరి అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నాగమహేశ్వరి మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆకుకూరలు, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం సేవా సంస్థ సభ్యులు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జీ సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఫణి కుమార్, మార్కాపురం డీఎం నరసింహులు, వైద్యాధికారులు వైద్య సంజీవ్, రామాంజనేయులు, సంస్థ జిల్లా అధ్యక్షుడు టీ రామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిచేందుకు వీలుగా ఈనెల 10వ తేదీ గురువారం ఉదయం 11గంటల నుంచి 12 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9959225702 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు, పరిష్కారాలు, సలహాలు, సూచనలు అందించి మెరుగైన సేవలు పొందేందుకు పాటుపడాలని కోరారు.

పగలే వెన్నెల



గిద్దలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొప్పువారివీదికి అనుబంధంగా ఉన్న వాసవీనగర్‌లో పట్టపగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. పట్టణంలోని చాలా ప్రాంతాలలో రాత్రులు సక్రమంగా వీధిదీపాలు వెలుగక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా వాసవినగర్‌లో మాత్రం పగలు కూడా వీధిదీపాలు వెలుగుతుండడం చూసి స్థానికులు నవ్వుకుంటున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి ఇలా వృథా అవుతున్నదని అంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వీధిదీపాలు వెలుగుతుండడంతో త్వరగా కాలిపోతున్నాయని, ఆ తరువాత కొత్తవాటిని ఏర్పాటు చేసే విషయంలో తీవ్ర జాప్యం జరుగు తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని మరికొన్ని ప్రాంతాలలో కూడా ఇలా పగలు, రాత్రి తేడా లేకుండా వీధిదీపాలు వెలుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు పగటిపూట వీధిలైట్లు వెలుగకుండా, విద్యుత్ వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.

మూలికా సంఘం అధ్యక్షుడిగా ఇమాంసాబ్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 9 ఆంధ్రజ్యోతి: పట్టణానికి చెందిన మూలికా వైద్యుడు షేక్ ఇమాంసాబ్ పారంపర్య మూలికా సంఘం ఆల్ ఇండియా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రావులపాలెంలో జరిగిన ఆయుర్వేద పారంపర్య మూలికా వైద్యుల సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఇమాంసాబ్‌ను ఎన్నుకున్నారు.

కాశీనాథ్‌కు సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో జరిగిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేసిన సందర్భంగా జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్‌ను కాపునాడు మహిళా సంఘం అధ్యక్షురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి సమిష్టి కృషితో పవన్ పర్యటన విజయవంతం చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.సునీత, న్యాయవాది సుజాత, లక్ష్మీ, గీత, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీరామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి.. వృద్ధుడి మృతి

కంభం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న ఆటోకు అడవి పందులు అడ్డురావడంతో బోల్తాపడిన ఘటనలో వృద్ధుడు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. అర్ధవీడు ఎస్సై శ్రీనివాసనాయక్ కథనం మేరకు.. మంగళవారం రాత్రి కంభం నుంచి అర్ధవీడుకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో చీమలేటిపల్లి సమీపంలో అడవి పందులు అడ్డురావడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అర్ధవీడుకు చెందిన చెందిన పోసాని తిరుపతయ్య (70), మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా వారిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తిరుపతయ్య మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం సత్యనారాయణ బృందం

బస్టాండ్‌లో వసతులు కల్పిస్తాం

ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ

పెద్దదోర్నాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దిగువ శ్రీశైలంగా పేరొందిన దోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో వసతులు కల్పిస్తామని రీజనల్ మేనేజర్ జీ సత్యనారాయణ అన్నారు. నటరాజ్ కూడలిలోని బస్టాండ్‌ను ఆర్ఎం సత్యనారాయణ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా కావలసిన వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. కంట్రోలర్‌ను నియమిస్తామని, బస్సులు నిలిచే ప్రాంతంలో గుంతలు పూడ్చివేత, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం తదితర అంశాలను పరిష్కరించనున్నట్లు ఆయన చెప్పారు. బస్టాండ్ నిర్మాణంపై మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఫణికుమార్, మార్కాపురం డిపో మేనేజర్ నరసింహులు, సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు టీ రామిరెడ్డి, ఘంటా గురవారెడ్డి, యక్కంటి మల్లారెడ్డి పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి

రాచర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గిద్దలూరు ఇరిగేషన్ శాఖ డీఈఈ రామారావు అన్నారు. మండలంలోని పాలకవీడు సర్కార్ పెద్ద చెరువు, సత్యవోలులోని దశబంధ చెరువు, సీతమ్మ కుంటలను బుధవారం ఆయన పరిశీలించారు. చెరువుల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను తెలియజేసి అందుకు సంబంధించి నివేదికలను తయారు చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. చెరువుల్లో పూడిక తీసి నీరు నిల్వ ఉండే విధంగా చూడాలన్నారు. చెరువు కట్ట తూములు, అలుగులకు సంబంధించి మరమ్మతు పనులు ఉంటే వాటి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఈ వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డెంగీ, మలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఎన్.మధుసూదన్‌రావు అన్నారు. డెంగీ మాసోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఇష్టకామేశ్వరి దేవాలయం, నెక్కంటి ప్రాంతాలలో చెంచులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గూడేలలో తిరిగి వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వై.రంగనాయకులు, వైపాలెం సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్ర రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ జానా రెడ్డి, వెంకట రామయ్య, ఆశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి

రాచర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వీ గిరిధరశర్మ అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన 4300 మొక్కలను బుధవారం ఆయన మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన కాలుష్యం నివారణ అవుతుందని మొక్కల వలన మంచి వాతావరణం లభిస్తుందని కాబట్టి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

తర్లుపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మీర్జపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వేరే పాఠశాలకు వెళ్తున్న ఐదుగురు ఉపాధ్యాయులను పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు స్వామి కుమార్, బి.కృష్ణారెడ్డి, రవిశేఖర్, ఎన్.ప్రసున్న, ఎస్‌వీ రమేష్ బాబును సాలువాలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేస్తు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మీర్జపేట ఉన్నత పాఠశాలలో బోధన చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రాజరపు గురవయ్య, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ధర్నా

పొదిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఉన్నఫలంగా మా నిర్మాణాలు కూల్చివేశారని, మాకు న్యాయం చేయాలని ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో బాధితులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సంఘ అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిర్మాణాలు కూల్చివేయడం సరికాదన్నారు. బాధితులను ఆదుకోవాలని తహసీల్దార్ క్రిష్టారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

పేకాట స్థావరంపై దాడి.. ఇద్దరి అరెస్ట్

రాచర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగారెడ్డిపల్లి పొలాల్లో పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసిన ఘటన బుధవారం జరిగింది. పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారమందడంతో ఎస్సై కోటేశ్వరారవు సిబ్బందితో దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. చోళ్లవీడులో ఓ వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కార్మిక సంఘాల ర్యాలీ



మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు



గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని పట్టణంలో బుధవారం సీఐటీయూ, ఏఐటీయూసీ వామపక్ష, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బంద్, ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ ఉద్యోగులు భో జన విరామ సమయంలో నిరసన తెలిపారు. కార్మిక సం ఘాలు కోర్టు సెంటర్ నుంచి నాలుగు మాడవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య, కాశీం, సీఐటీయూ నా యకులు రూబెన్, సుబ్బరాయుడు, నాగరాజు, అంగన్‌వాడీలు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

గిద్దలూరు : కార్మికులకు వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం నుంచి కుమ్మరాంకట్ట, పెద్దబజారు, పొట్టి శ్రీరాములు రోడ్డు, వైఎస్ఆర్ సెంటర్ మీదుగా ర్యాలీ సాగింది. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలకోటయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆవులయ్య, గిరి, నరసింహులు పాల్గొని ప్రసంగించారు.

కంభం : సీఐటీయూ నాయకుడు అన్వర్ ఆధ్వర్యంలో పట్టణంలోని వైజంక్షన్ నుంచి బస్టాండ్ మీదుగా కందులాపురం సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రోశయ్య, నాజర్ వలి, మహబూబ్‌బాషా, ఆశా, మధ్యాహ్న భోజన సంఘం, తోపుడు బండ్లయూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాచర్ల : కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి డీ తామస్ అన్నారు. కార్మిక చట్టాలు అమలుకు దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు మద్దతుగా బుధవారం రాచర్లలో వివిధ సంఘాల కార్మికులు నిరసన తెలియజేస్తూ డిమాండ్ల సాధనకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల సభ్యులు విజయలక్ష్మీ, లక్ష్మీదేవీ, కుమారి, సంతోషి కుమారి, రంగమ్మ, జోష్న, రాజమ్మ, గురవయ్య, పద్మ, నాగలక్ష్మీ, పాపయ్య, కృష్ణమాచారి పాల్గొన్నారు.

బేస్తవారపేట : బేస్తవారపేటలో వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య, సీపీఐ నాయకులు జోసఫ్, ఏఐటీయూసీ నాయకుడు యోగయ్య, అబ్రహం పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : సమానపనికి సమాన వేతనం చెల్లించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు వీధుల్లో బ్యాంకులు, పోస్టాఫీస్, టెలిఫోన్‌ఆఫీసులను మూసివేయించారు. బ్యాంకుల వద్ద కార్మిక నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, కిష్టగౌడ్, సాంబశివరావు, వెంకటశివయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

బీఎల్వోలకు సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తప్పులకు తావు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితాలను తయారు చేయాలని సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ బీఎల్వోలను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఎల్వోలతో తహసీల్దార్ చిరంజీవి బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన త్రివినాగ్ ప్రతి 1200 ఓటర్లకు ఒక బూత్‌ను ఏర్పాటు చేయాలన్నారు. బూత్‌ల పరిధిలో ఓటర్లను కలిసి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నారాయణ, ఎలక్షన్ డీటీ ప్రభావతి, బీఎల్వోలు పాల్గొన్నారు.

గిద్దలూరు : గిద్దలూరు రూరల్ పరిధిలోని బూత్ లెవెల్ ఆఫీసర్లకు వివిధ అంశాలపై ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.శివరామిరెడ్డి శిక్షణ ఇచ్చారు. కొత్త ఓటర్ల చేర్పులకు, మార్పులకు, తొలగింపునకు సంబంధించి దరఖాస్తులను ఏ విధంగా పూరించాలి, ఏ విధంగా నోటీసులు జారీ చేయాలి అనే విషయంపై వివరించారు. జాబ్‌చార్ట్‌ను, ఓటరు లిస్టులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.ఆంజనేయరెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం ఖలీల్ పాల్గొని ప్రసంగించారు.

పుల్లలచెరువు : బీఎల్‌వోలు ఓటర్ల జాబితాను పారదర్శకంగా చేపట్టాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎంవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం పుల్లలచెరువులో బీఎల్‌వోలు, సూపరువైజర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ మాస్టరు వెంకట క్రిష్టారెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ డా.యు.నాగరాజు అన్నారు. శ్రీ సాధన కళాశాలలో బుధవారం విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను, వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాల కేసుల్లో పట్టుబడి పోలీసు రికార్డుల్లో పేరు నమోదు అయితే భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందలేరన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని బాధితులైతే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు తెలుసుకోవాలని సీఐ సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వీఆర్‌కే ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి, జీఎల్‌వీ రమేష్, ప్రిన్సిపాల్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : బాలికలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వీ మహేష్ అన్నారు. ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లు అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భరద్వాజ ఈశ్వర్ సింగ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలా పేరెంట్స్‌డే వేడుకలు

దొనకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్‌డే వేడుకలు పండుగలా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో సాంబశివరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులతో సమావేశమై విద్యార్థుల భవిష్యత్తుపై చర్చించనున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికి ఒక మొక్కను నాటి పెంచేలా తల్లిపేరుతో ఒక మొక్కను ఇస్తామన్నారు. విద్యార్థుల చదువులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు, ఉచిత పాఠ్య పుస్తకాలు, విద్యా సామగ్రి అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. పాఠశాలలపై తల్లిదండ్రుల పాత్ర మరింత మెరుగుపర్చాలనే ధ్యేయంగా మేగా పేరెంట్స్‌డేను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎంఈవో పేర్కొన్నారు.

మంచి, చెడులపై విచక్షణ కలిగిఉండాలి

తాళ్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంచి చెడులపై విద్యార్థులు విచక్షణ కలిగి నడుచుకోవాలని ఎస్‌ఐ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. బుధవారం శివరాంపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాలను ఎంచుకుని సాధించేదిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, కష్టపడి చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దొనకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ షేక్ నాగూర్ తెలిపారు. 33కేవీ నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని కొచ్చెర్లకోట, రామాపురం, బసిరెడ్డిపల్లి, సిద్దాయిపాలెం, నారపురెడ్డిపల్లి గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. బుధవారం సీఎస్‌పురంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు పాలగుళ్ల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. దద్దాల మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేకల శ్రీనివాస్, భువనగిరి వెంకటయ్య, మితికెల గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ ద్వారా పాఠశాలల అభివృద్ధి

కనిగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకంలో భాగంగా రాష్ట్రంలోని 855 ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర సీమాట్ డైరెక్టర్ బీఎస్ మస్తానయ్య తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. పాఠశాలలో మెగా పీటీఎం కిట్లు, సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు, విద్యార్థులకు అందించిన యూనిఫాం, షూస్, బ్యాగ్‌లు, నోట్‌బుక్‌లను పరిశీలించారు. ఆయన వెంట కనిగిరి, సీఎస్‌పురం, పీసీపల్లి ఎంఈవోలు నారాయణరెడ్డి, కొండారెడ్డి, జి.సంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలంటూ రైల్వే బోర్డు మెంబర్‌కు విజ్ఞప్తి

దొనకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొడ్డా వెంకటరావు, బత్తుల శ్రీనివాసరావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దయ్యాల వెంకటేశ్వర్లు రైల్వే బోర్డు మెంబర్ శిద్దా సూర్యకుమారికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ అధ్యక్షుడు మాధవ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా విజయవాడలోని పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆమెను వారు కలిశారు.

హైస్కూల్ పరిసరాలు పరిశుభ్రం

తాళ్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): తూర్పు గంగవరం హైస్కూల్ పరిసరాలు చిల్ల చెట్లు, పిచ్చిచెటల్తో అపరిశుభ్రంగా ఉన్నాయి. ఈక్రమంలో టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి వల్లభనేని సుబ్బయ్య బుధవారం ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించారు.

జామాయిల్ మొక్కలను ధ్వంసం చేశారని ఫిర్యాదు

పీసీపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): జామాయిల్ మొక్కలను పీకేశారంటూ తలకొండపాడు గ్రామానికి చెందిన గంగవరపు వెంకటనారాయణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆగ్రామానికి చెందిన బాధిత రైతుకు సర్వేనెంబరు425/2లో 0.89సెంట్ల భూమి ఉంది. అందులో 9నెలల క్రితం జామాయిల్ మొక్కలు నాటారు. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు జామాయిల్‌ను పెకిలించి ఎత్తుకెళ్లారు. దీంతో వెంకటనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతర పోరు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రంగారావు
- కేంద్ర ప్రభుత్వం విధానాలను నిరసిస్తూ సమ్మె
- పాల్గొన్న కార్మికులు, సంఘాల నాయకులు
- పలుచోట్ల ర్యాలీలు



పామూరులో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు హనీఫ్

దర్శి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రంగారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలుచేయటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యు.నారాయణ, జి.జాన్, సామ్యేల్, గోగు వెంకయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దర్శి పట్టణంలో నాయకులు, కార్యకర్తలు బుధవారం సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నూతనంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జె.కోటేశ్వరరావు, కె.అంజనేయులు, సింగరకొండ శ్రీను, ఇత్తడి ఇర్మియా, కె.శ్రీదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: అసంబద్ధమైన లేబర్‌కోడ్ చట్టాలను రద్దు చేసి కార్మిక హక్కులను కాపాడాలని కోరుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ వేర్వేరుగా బుధవారం కనిగిరిలో సార్వత్రిక సమ్మె నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు యాసిన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాతూరు నుంచి పామూరు బస్టాండు మీదుగా ఆర్డీఓ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో యాసిన్ తదితరులు మాట్లాడారు.



దర్శి: సమ్మెలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు హనుమంతరావు

సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి వైఎస్సార్ రోడ్డు మీదుగా పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాల యం వద్ద జరిగిన ధర్నాలో పీసీ కేశవరావు, పిల్లి తిప్పారెడ్డి, తదితరులు మాట్లాడారు.

పామూరు: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ ఆరోపించారు. బుధవారం సమ్మె సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.మాల్యాద్రి, షేక్ ఖాదర్‌బాషా, అల్లాబక్ష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎస్‌పురం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు.

ముండ్లమూరు: సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాసరావు, పంటా ఏడుకొండలు, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు పి.మహేష్ డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పీసీపల్లిలో జరిగిన సమ్మెలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల చట్టాలను తుంగలో తొక్కి వారి హక్కులను హరించివేస్తుందన్నారు.

దొనకొండ: సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మికులు దొనకొండలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు.

తాళ్లూరు: కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని సీఐటీయూ నాయకుడు బోడపాటి హనుమంతరావు అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తాళ్లూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రీసర్వే డీటీ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు పూనూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వెలిగండ్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇమ్మడిచెరువు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి ఒక్కరే ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. హాజరు పట్టీలో రోజువారీ సంతకాలు లేవని గుర్తించి ఉన్నతాధికారులతో మాట్లాడి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ఉద్యోగస్తులు ఈవిధంగా చేయడం సరికాదన్నారు. అనంతరం ఇమ్మడిచెరువు జడ్పీ హైస్కూల్‌లో ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులను సన్మానించి నగదు ప్రోత్సాహం అందజేశారు. పాఠశాలలో బీసీ హస్టల్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయంలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

గన్నవరం బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

మండలంలోని గన్నవరం గ్రామస్థులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగిఉన్న బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర రూ.2.20కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. బుధవారం ఆయన పనులను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, చౌడారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

కురిచేడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పొట్లపాడు గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసి చూపిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలను తీసుకెళ్ళి వారికి తెలియజేస్తున్నామన్నారు. ప్రజల బాగోగులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, గ్రామ అధ్య క్షుడు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


పొట్లపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ లక్ష్మి

పామూరు: రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని నుచ్చుపొద గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌చౌదరి, ఎం.రమణయ్య, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మన్నేపల్లి చిరంజీవి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందజేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని పెదఉల్లగల్లు గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు మోతుకూరి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

కురిచేడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో ప్రమాదవశాత్తు వ్యక్తి పడి మృతి చెందాడు. ఈఘటన బుధవారం కురిచేడు మండలం అలవలపాడులో చోటుచేసుకుంది. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని రావి పెద్దకోటయ్య పొలంలో నీటి గుంత తీశారు. మిర్చి, పొగనారు పెంచేందుకు కోటయ్య ఆ గుంతలో బోర్ల ద్వారా నీటిని పెట్టి నింపుతున్నాడు. నీటి గుంత కొలతలకోసం అధికారులు వస్తుండటంతో కొరివి రోశయ్య(35)ను రైతు కోటయ్య పనికోసం పిలిచాడు. ఈక్రమంలో రోశయ్య ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయాడు. అక్కడ ఉన్నవారు గమనించి నీటిలోకి దిగి తీసే ప్రయత్నం చేశారు. అప్పటికే రోశయ్య మృతి చెందాడు. కుంటలో నీరు ఎక్కువగా ఉండటంతో గ్రామస్థులు ఎక్సవే టర్‌తో కట్టను పగులకొట్టి నీటిని బయటకు పంపారు. అనంతరం రోశయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

దర్శి వైద్యశాలలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కురిచేడు ఎస్‌ఐ శివ నెల్లూరులో రొట్టెల పండుగ విధులకు వెళ్ళడంతో దొనకొండ ఏఎస్‌ఐ కేసు నమోదు చేశారు.


మృతి చెందిన రోశయ్య

ఓటరు జాబితాలో తప్పులకు తావులేకుండా చూడాలి

కనిగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశపు హాలులో ఏడు రోజులపాటు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్నారు. రెండోరోజు బుధవారం వెలిగండ్ల మండలానికి చెందిన బీఎల్‌వోలకు జరిగిన శిక్షణలో ఆర్డీవో మాట్లాడారు. ఓటరు ఫారం పరిశీలనకు వెళ్ళినపుడు సదరు కుటుంబసభ్యులను పూర్తిగా విచారించి ఫారం నమోదు చేయాలన్నారు. ఓటు నమోదు, తొలగింపును వీఆర్‌ఓలతో చర్చించి వారి సమక్షంలో చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వాసు, పీవీ రమణారెడ్డి, రవిచంద్ర, డి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కురిచేడు: దర్శి నియోజకవర్గంలోని బూత్ లెవెల్ అధికారులకు బుధవారం కురిచేడులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.జాన్సన్, తహసీల్దార్ రజనీకుమారి, ఎలక్షన్ డీటీ దేవప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా బీఎల్‌వోలకు శిక్షణ పత్రాలు అందజేశారు

నేడు అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులు పునఃప్రారంభం

దర్శి, జూలై 9(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులు గురువారం పునఃప్రారంభమవుతున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూ.26 లక్షల వ్యయంతో భవన నిర్మాణం ప్రారంభించారు. 79 శాతం పనులు పూర్తయ్యేసరికి 2019 సాధారణ ఎన్నికలు వచ్చాయి. ఆఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావటంతో నిర్మాణ పనులు మూలనపడ్డాయి. అప్పటినుంచి భవన నిర్మాణం నిలిచిపోయింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నా క్యాంటీన్ పునఃప్రారంభం కోసం ఎంతో కృషి చేశారు. సీఎం చంద్రబాబును, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అనేకసార్లు కలిసి భవనం పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేయటంతో అందుకు అంగీకరించి నిధులు విడుదల చేశారు.

మున్సిపాలిటీ అధికారులు, సోషల్ వెల్ఫేర్ శాఖ అధిరారుల ఆధ్వర్యంలో గురువారం అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులు పునఃప్రారంభమవుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవి రిజర్వేషన్ మార్పు

దర్శి, జూలై 9(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి రిజర్వేషన్ మార్పు జరగటంతో అయోమయం నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలల క్రితం రిజర్వేషన్లు ప్రకటించారు. ఆ జాబితాలో దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి జనరల్ మహిళ కేటగిరికి కేటాయించారు. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. దర్శి పట్టణానికి చెందిన దార నాగవేణిని చైర్మన్‌గా నియమించాలని అధిష్ఠానానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర పెద్దలు కూడా ఆ ప్రతిపాదనలు ఖరారు చేసి జాబితాను విడుదల చేశారు. దీంతో దారం నాగవేణికి ఏఎంసీ చైర్మన్ పదవి ఖరారైనట్లు అందరూ భావించారు. తాజాగా చైర్మన్ పదవిని ఎస్సీ జనరల్‌కు కేటాయిస్తూ మార్కెట్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడటంతో టీడీపీ కూటమి క్యాడర్‌లో, ప్రజల్లో అయోమయం నెలకొంది. తొలుత ప్రకటించిన జాబితాను మార్చి ఇప్పుడు రిజర్వేషన్లు మార్చటంతో గందరగోళ పరిస్థితి నెలకొంటుందని క్యాడర్ ఆందోళన చెందుతుంది.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

ముండ్లమూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో ఖర్చు తక్కువతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుపలరావు రైతులకు సూచించారు. బుధవారం ముండ్లమూరు, పోలవరం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ రైతుల అర్హుల జాబితాను ఉంచినట్లు చెప్పారు. అర్హత ఉండి జాబితాలో పేర్లు నమోదు కాకపోతే ఈనెల 13లోగా సంబంధిత ఆధారాలతో రైతు సేవా కేంద్రాలకు వెళ్ళి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈసందర్భంగా రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పైరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో వీ కీర్తి, వీఏఏలు ప్రదీప్, రజాక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రభాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పామూరు మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు, బోడవాడ గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ఏవో టి.అబ్రహం లింకన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులు పలు సూచనలు చేశారు.

గోకులం షెడ్ల పరిశీలన


గోకులం షెడ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసెఫ్ కుమార్

కురిచేడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదనంపాడు గ్రామంలోని గోకులం షెడ్లను జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ జోసెఫ్ కుమార్ పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడారు. కంపోస్టు పిట్‌లను నిర్మించుకుంటే స్వంతగా కంపోస్టు ఎరువును తయారు చేసుకోవచ్చునని చెప్పారు. ఎవరికైనా సమస్యలు ఉంటే చెప్పాలని అడిగారు. రైతులు మంచి పంటలు పండించి లాభాలు గడించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లలచెరువు శశికళ, ఆర్.లలిత, ఏపీవో దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

పామూరు, జూలై 9(ఆంధజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్ కటకం సజన అధ్యక్షతన బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్య కోసం అధిక నిధులు వెచ్చిస్తుందని చెప్పారు. ఈఅవ కాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యలో రాణించి భవిషత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినుల అవసరాల కోసం నాలుగు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు సన్మానం

పామూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మాధవ్‌ను బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో పామూరు శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మడి శెట్టి శ్రీను ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో పి.విజయకుమార్‌చారి, చామల శ్రీనివాసులురెడ్డి, పాడే అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు

పీసీపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై జి.కోటయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని మురుగుమ్మి జడ్పీ ఉన్నత పాఠశాలలో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని చిల్లర దుకాణాలను తనిఖీ చేశారు. పాఠశాలకు వంద మీటర్ల దూరంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





సభా స్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

ప్రపంచ జనాభా దినోత్సవ వేదిక

వెలగపూడి

- రేపటి కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- సచివాలయం సమీపంలో ఏర్పాట్లు.. పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

తుళ్లూరు(వెలగపూడి), జూలై 9 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం. వెలగపూడి సచివాలయం సమీపంలో ఈ కార్యక్రమానికి వేదిక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించి భారీగా ఏర్పాట్లను చేస్తున్నారు. బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ బార్గవతేజ ఆయా ఏర్పాట్లను పరిశీలించారు. సభా స్థలి, బారికేడింగ్, వాహనాల పార్కింగ్, సిట్టింగ్, తాగునీరు, పారిశుధ్య పనుల ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, సీపీవో శేషశ్రీ, డీపీవో నాగ సాయికుమార్, డ్వామా పీడీ శంకర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎంపీడీవో శిల్ప, తహసీల్దారు సుజాత తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం..

గందరగోళం!



జిల్లా వ్యాప్తంగా 1207 అర్జీలు రాక

గడచిన నెల 13న తల్లికి వందనం డబ్బులను తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిన సంగతి తెలిసిందే. పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను నిధుల విడుదల సమయంలోనే పాలకులు స్పష్టంగా చెప్పారు. కానీ అప్పటి నుంచి కూడా పథకం అమలుపై ప్రజల్లో గందరగోళం ఉంటూనే ఉంది. తల్లికి వందనం నిధుల జమ దగ్గర నుంచి ఇంకా పథకం ఫలాలు అందుకోని వారిలో ఉన్న అపోహలు తొలగించడంపై అధికారులు దృష్టిపెట్టకపోగా, జిల్లాకు సంబంధించిన గణాంకాల విషయంలో కూడా వారిలోనే అస్పష్టత రాజ్యమేలుతుండడం గమనార్హం. తల్లికి వందనం పథకం అర్హుల గుర్తింపు సచివాలయాల వారీగా జరగ్గా, వారితో విద్యాశాఖ సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో అది లోపించడంతో ప్రజల అనుమానాలు తీర్చేవారే కరువయ్యారు.

- అర్హత ఉన్నా అందలేదని ఆవేదన
- అపోహలు తొలగించే వారే కరువు
- ఎస్సీ లబ్ధిదారుల్లో మరింత గందరగోళం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తల్లికి వందనం పథకం అమలు కసరత్తులో భాగంగా ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 2,06,319 మంది విద్యార్థులకు బాపట్ల జిల్లాలో అర్హత ఉన్నట్లుగా యంత్రాంగం ప్రాథమికంగా గుర్తించింది. ఇందులో గత నెల పథకం అమలు చేసిన రోజున 1,45,000 మంది విద్యార్థులకు గాను 95 వేల మంది తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకం డబ్బులు జమ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ముగ్గురు కన్నా ఎక్కువ మంది పిల్లలున్న తల్లులను 1450 మందిగా ప్రభుత్వం తేల్చి వారి ఖాతాల్లో కూడా డబ్బులను జమ చేసింది. అర్హత కలిగిన విద్యార్థుల సంఖ్యకు, డబ్బులు జమ అయిన విద్యార్థుల సంఖ్యకు తేడా ఉండడానికి గల కారణాలను కూడా ప్రభుత్వం అప్పుడే తెలిపింది. కానీ వాటిని ప్రజల దరికి చేర్చడంలో యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది

గ్రీవెన్స్‌కు తల్లుల క్యూ

ఒకటి, ఇంటర్ వారికి త్వరలో....

ప్రభుత్వం తల్లికి వందనం పథకం నిధులు విడుదల చేసేనాటికి స్కూళ్లలో, కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభ దశలోనే ఉన్నాయి. దీనితో అటు పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంకా కళాశాలల్లో చేరకపోవడంతో వారు చేరాక డబ్బులు వేయాలన్న ఉద్దేశంతో వారికి డబ్బులు వేయలేదు. ఒకటో తరగతికి సంబంధించి అడ్మిషన్లపై స్పష్టత ఆసమయానికి రాలేదు. ప్రస్తుతం ఆ రెండింటికి సంబంధించి స్పష్టత రావడంతో ప్రభుత్వం త్వరలోనే తల్లికి వందనం (మిగతా 6లో)



బాపట్ల మండల పరిధిలోని పాఠశాలలకు మొక్కల పంపిణీ

బడి పండుగకు విద్యాలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో గురువారం పండుగ వాతావరణంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు జరగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, మౌలిక వసతులపై తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించ డంతో పాటు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం నెలకొల్పి తద్వారా విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట లక్ష్యంగా మెగా పేరెంట్స్ మీట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది నిర్వహించింది. ఇది విజయవంతం కావడంతో పాటు సత్ఫలితాలు ఇచ్చిందది. దీంతో ఈ ఏడాది కూడా మెగా పేరెంట్స్ మీట్‌ను నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలోని అన్ని పాఠశాలలు మెగా పేరెంట్స్ మీట్‌కు సిద్ధ మయ్యాయి. కాగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఉత్సాహం చూపుతుండటంతో పండుగ వాతావరణంలో బడి పండుగకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- మెగా పీటీఎం 2.0కు ఏర్పాట్లు
- జిల్లాలోని 1,753 స్కూళ్లలో నిర్వహణ
- తల్లిపేరుతో విద్యార్థి మొక్క నాటేలా ఏర్పాట్లు
- జిల్లా స్థాయిలో మేదరమెట్ల జడ్పీ పాఠశాలలో వేడుక
- పాల్గొననున్న మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్

బడి పండుగ నేడు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులను, టీచర్లను ఒకే వేదిక మీదకు తెచ్చి లోటుపాట్లు చర్చించడంతో పాటు చదువులో విద్యార్థుల ప్రొగ్రెస్‌ను అంచనా వేయడానికి ప్రభుత్వం పీటీఎం (పేరెంట్స్-టీచర్ మీటింగ్)కు గతేడాది డిసెంబరులో శ్రీకారం చుట్టింది. ఏడాదికి రెండుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దానిలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ 2.0 నిర్వహణకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మౌలిక వసతుల కల్పన, చదువులో విద్యార్థుల ప్రతిభ, గ్రామంలోని దాతల సహకారంతో పాటు అన్ని అంశాలు చర్చకు వచ్చేలా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1753 పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో 1,63,000 మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు భాగస్వామ్యం కానున్నారు. గతంలో పాఠశాలలకే పరిమితం చేసిన పీటీఎంను జూనియర్ కళాశాలలకు కూడా విస్తరింపచేశారు. మెగా పేరెంట్స్- టీచర్స్ జిల్లా స్థాయి కార్యక్రమానికి కొరిశపాడు మండల పరిధిలో ని మేదరమెట్ల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదిక కానుంది. మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళి ఇక్కడే జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. రేపల్లెలోని మూడో వార్డులోని మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే మెగా పీటీఎంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరు కానున్నారు.

జిల్లా వ్యాప్తంగా 1,08,000 మొక్కలు

మెగా పీటీఎంను పురస్కరించుకుని ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఓ మొక్క నాటేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో 1,08,000 మొక్కలను ఇప్పటికే అందుబాటులో ఉంచారు. గురువారం సమావేశం ముగిసిన అనంతరం విద్యార్థులకు వాటిని అందించనున్నారు. వాటిని తమ ఇంటిలో కానీ, లేదా పాఠశాల ఆవరణలో గాని, మరెక్కడైనా వారికి ఇష్టమైన ప్రదేశంలో ఆ మొక్కను నాటుకునే స్వేచ్ఛను విద్యార్థులకు ప్రభుత్వం కల్పించింది. కాకపోతే తల్లిపేరుతో ఆ మొక్కను నాటడంతో పాటు దాని పోషణను కూడా సదరు విద్యార్థి క్రమం తప్పకుండా చూసేలా నేటి సమావేశంలో చైతన్యం కల్పించనున్నారు.

పాలకులం కాదు ప్రజా సేవకులం

అభివృద్ధి, సంక్షేమంతో కూటమి పాలన

తురుమెళ్ల తొలిఅడుగులో ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తాము పాలకులం కాదని ప్రజలకు సేవకులం అంటూ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల పరిధిలోని తురుమెళ్లలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ ఏడాదిలో అందించిన పథకాల గురించి వివరించి, కూటమి పాలన గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. గుంటూరు నుంచి నిజాంపట్నం వరకు నాలుగు వరసల రోడ్డు అమృతలూరు మండలవాసులకు అందుబాటులోకి వస్తుందన్నారు. జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తమ వద్ద గిడ్డంగుల్లో పూర్తిస్థాయిలో ఎరువుల నిల్వలు ఉన్నాయని చెప్పారు. వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వల్లే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, కొసరాజు దేవకుమార్, సర్పంచ్ ఇందిర, బేతాళ కిరణ్, అళ్ల అంకమ్మరావు, గ్యారా నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొన్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఆనందబాబు

కార్మిక చట్టాల రద్దును సహించం

చెరుకుపల్లిలో సార్వత్రిక సమ్మెలో నేతలు



చెరుకుపల్లి అంబేద్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన కార్మికులు

చెరుకుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్లుగా మారుస్తున్న కేంద్రప్రభుత్వ విధానాలను సహించేది లేదని ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు తెలిపారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం చెరుకుపల్లిలో కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. అంబేద్కర్‌సెంటర్ నుంచి సంతబజార్, తహసీల్దారు కార్యాలయం, ఖాదర్‌ఖాన్ ఆస్పత్రి మీదగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. నాయకులు మర్రివాడ వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికచట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా చట్టాలను మారుస్తుందని విమర్శించారు. కార్మికుల హక్కులను హరిస్తూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సీతారామయ్య, వీరప్రసాద్, జగ్గారావు, పార్వతి, కారుమూరు మోహన్‌రావు, రామకృష్ణ, బండారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు

ముళ్ల చెట్లతో చిట్టడవిని తలపిస్తున్న సుందరవనం

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.. మొక్కలు నాటండి.. చెట్లు పెంచండి అంటూ పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టే అధికారులు నాటిన మొక్కలను సంరక్షించడాన్ని విస్మరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది మొక్కలు నాటామంటూ ప్రచారం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదుట హైవే పక్కనే పురపాలక సంఘానికి సంబంధించిన స్థలాన్ని అధికారులు దత్తత తీసుకుని పెద్దఎత్తున మొక్కలు నాటారు. నాడు సుందరవనం చేస్తామని అధికారులు ప్రకటించారు. 2023లో నాటిన మొక్కలు కనిపించకుండా పోయాయి.సుందరవనం స్థలంలో ప్రస్తుతం ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.నందిరాజుతోట ఇటు బాపట్ల పట్టణం మధ్య ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం చిట్టడవిని తలపిస్తున్నది. ఈ స్థలంలో వర్మి కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. అక్కడ మొక్కలు నాటారన్న విషయం తెలియకుండా వర్మికంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంపై బాపట్ల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్‌యార్డు సమీపంలో పురపాలక సంఘ స్థలానికి ఎదురుగా గుట్టలుగా పోసిన చెత్త



బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదుట పురపాలక సంఘ స్థలంలో పెరిగిన ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు

బడి శిథిలం.. ఏడాదిగా మూత

- మోడల్ పాఠశాలైనా ఏడాదిగా పరాయి పంచన
- ధర్మవరం హిందూ పాఠశాల వరండాలోనే హెచ్‌సీ తరగతులు

అద్దంకి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యంతో ధర్మవరం (హరిజన కాలనీ) పాఠశాల పరాయి పంచన నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడుతో పాఠశాల రూపురేఖలు మారాయని చెప్పుకున్న పాలకులకు ధర్మవరం ఎస్సీ కాలనీ కాలనీలో ప్రాథమిక పాఠశాల కనిపించకపోవడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. అద్దంకి మండలంలోని ధర్మవరం ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గత ఏడాది వర్షాలకు నీరు చేరడంతో పాఠశాలను మూసేశారు. ఈ పాఠశాల తరగతులను సమీపంలో ఉన్న హిందూ పాఠశాలలో కలిపి నిర్వహిస్తున్నారు. రెండు పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఏడాదిగా నిర్వహిస్తున్నారు. హిందూ పాఠశాలలో కూడా నాలుగు గదులే ఉండటంతో రెండు గదులలో హిందూ పాఠశాల, మరో రెండు గదులలో హెచ్‌సీ పాఠశాల నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హెచ్‌సీ పాఠశాలలో 61 మంది విద్యార్థులు ఉండటంతో మోడల్ పాఠశాలగా మార్పు చేసి ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయించారు. దీంతో రెండు తరగతులను గదుల్లో, మూడు తరగతులను వరండాలో నిర్వహిస్తున్నారు. పేరుకే మోడల్ పాఠశాలగా మారినా కనీస వసతులు కూడా లేకుండా వరండాలో చదువు కోవాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. మూతపడిన పాఠశాల వరండా లో స్థానికులు ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర సామాగ్రి ఉంచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు తొలగించి కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చీరాల ఉప విద్యాశాఖాధికారి గంగాధరరావు తెలిపారు.



ధర్మవరం హిందూ ప్రాథమిక పాఠశాల వరండాలో నిర్వహిస్తున్న తరగతులు



ధర్మవరం దళిత కాలనీలో మూసివేసిన పాఠశాల ఆవరణలో స్థానికులు ఉంచిన ట్రాక్టర్, ఆటోలు

నేరాల నియంత్రణకు డ్రోన్‌లతో నిఘా కీలకం : ఎస్పీ

- జిల్లా పోలీసుశాఖకు 6 డ్రోన్‌లను బహూకరించిన దాతలు

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాల కట్టడి, నేరాల నియంత్రణకు డ్రోన్‌లతో నిఘా కీలకమని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 6 డ్రోన్‌లను జిల్లా పోలీసుశాఖకు దాతలు బుధవారం బహూకరించారు. దాతలను ఎస్పీ ఘనంగా సన్మానించి సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వినూత్న ఆలోచనలతో ప్రేరణ పొంది జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, నిఘా, విపత్తుల నిర్వహణ కోసం సామాజిక బాధ్యతతో, సేవాదృక్పథంతో డ్రోన్‌లను బహూకరిస్తున్నట్లు దాతలు తెలిపారు.



నాడు అధ్వానంగా ఉన్న రహదారి నేడు అందంగా రూపుదిద్దుకొని..

ఎమ్మెల్యే చొరవతో రహదారి నిర్మాణం

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజలు రహదారులు లేక అవస్థలు పడుతున్న నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య ప్రత్యేక చొరవతో రాజమార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలోనే మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీ దుర్గా నగర్‌లో సుమారు 30 సంవత్సరాలుగా అంతర్గత రహదారులు లేక ప్రజలు నానా యాతన పడుతున్నారు. దీంతో గ్రామస్థులు ఇటీవల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే రూ.9.50 లక్షల పంచాయతీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

మద్దిపాడు, జూలై9(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం మద్దిపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ఆసుపత్రిలోని అన్ని గదులను, ఎన్‌టీఆర్ వైద్య సేవ కౌంటర్‌ను, ఓపీలను, అత్యవసర సేవా విభాగాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో ఉద్యోగ సిబ్బంది జాబ్‌చార్టును అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రసవాలకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించి అందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులతో మాట్లాడారు. వైద్యసేవల గురించి ఆరా తీయగా సక్రమంగానే అందుతున్నట్లు రోగులు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి, డాక్టర్ అన్వేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు ముగిసిన శిక్షణ

ఒంగోలు (రూరల్), జూలై9(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌లో బుధవారం ఎన్నికల జాబితా నిర్వహణపై 50మంది బీఎల్‌వోలకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సమయంలో బీఎల్‌వోలు బాధ్యతగా వ్యవహరించటం ఎంతో అవసరమన్నారు. అదేవిధంగా 18సంత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకులకు ఓటుహక్కు కల్పించాలని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పక ఆచరించాలన్నారు.

● పొన్నలూరు: ఓటరు జాబితాల నిర్వహణపై మండలంలోని బూత్‌లెవల్ అధికారులకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులపై బిఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. కొండపి ఎలక్ట్రోరల్ అధికారి ఏ.కుమార్, తహసీల్దార్ పుల్లారావు శిక్షకులుగా వ్యవహరించారు.

తల్లికి వందనం.... గందరగోళం!

(5వ పేజీ తరువాయి)

డబ్బులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడానికి కసరత్తు చేస్తోంది. కానీ ఈ విషయంలో తల్లుల అనుమానాలను తీర్చడంలో విద్యాశాఖ నిర్లక్ష్యం వహించడంతో తమ ఖాతాల్లో డబ్బులు పడలేదన్న హైరానా వారిలో వ్యక్తమవుతోంది

ఎస్సీ విద్యార్థుల విషయంలోనూ అంతే...

తల్లికి వందనం నిధుల విడుదల సమయంలో కొంతమంది ఎస్సీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,900 మాత్రమే జమ అయినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. నిజానికి ప్రభుత్వం నిధుల విడుదల సమయంలోనే ఈ విషయంపై స్పష్టత ఇచ్చింది. స్వల్పమొత్తంలో కార్పొరేషన్ నిధులను దీనికి అనుసంధానం చేశామని, ఎవరికైనా డబ్బుల్లో కోత పడితే, అందులో నిధులు జమ కాగానే ఖాతాల్లో ఆటోమేటిక్‌గా పడతాయని తెలిపింది. కానీ ఈ విషయంపై సదరు లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలోనూ మీనమేషాలు లెక్కిస్తుండడంతో ఆ డబ్బుల విషయంలో తల్లులు గందరగోళ పడుతుండగా, ప్రభుత్వం ఆ డబ్బులను స్వాహా చేసిందనే ప్రచారం కూడా బయట పెద్దఎత్తున జరుగుతోంది. పథకానికి సంబంధించి డబ్బుల జమ విషయంలో విద్యాశాఖ వైపు నుంచి ఇప్పటి వరకు ఓ ప్రకటన జారీకాకపోవడం ఒక ఎత్తయితే అపోహల నివృత్తికి తీసుకున్న చర్యలేంటనే దానికి వారి వద్ద సమాధానమే లేదు

అర్హత ఉన్నా అందలేదని 1,207 మంది తల్లులు

తల్లికి వందనం పథకానికి సంబంధించి అన్ని అర్హతలున్నా తమ ఖాతాల్లో డబ్బులు పడలేదని జిల్లా వ్యాప్తంగా 1207 మంది తల్లులు పీజీఆర్ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్) గడప తొక్కారు. ఇందులో 831 మంది అర్జీలు సహేతుకమైనవిగా గుర్తించి అధికారులు స్వీకరించారు. 229 మందిని అర్హులుగా గుర్తించినట్లు సమాచారం. మిగిలిన వారి విషయంలో గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేపట్టిన వెబ్‌ల్యాండ్ డేటా వారి పాలిట శాపంగా మారినట్లు తెలుస్తోంది. కేవలం పీజీఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఇదే కాగా సచివాలయాల వారీగా భారీగా తల్లికి వందనం దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. పథకం అమలు జరిగి నెల గడుస్తున్నా ఇప్పటి వరకు జిల్లాలో అర్హత ఉండి ఈ కేవైసీతో పాటు తల్లిమరణం, లేదా విద్యార్థి మృతి వంటి కారణాలతో ప్రభుత్వం నిధుల జమ చేయని వారు ఉన్నారు. ఈ కేవైసీ విషయంలో ఉన్న సాంకేతిక చిక్కులు తొలగించుకున్న వారికి త్వరలోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. అధిక భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఉండడం, ఆదాయపుపన్ను, ఫోర్ వీలర్ ఉండడం వంటి కారణాలతో పథకానికి అనర్హులుగా మారిన వారు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గత ప్రభుత్వ తప్పిదాలతో పథకానికి దూరమైన వారు ఉన్నారు

డేటా విషయంలో నిర్లక్ష్యమే...

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తల్లికి వందనం నిధులు డబ్బులను పెద్ద ఎత్తున తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఇంతటి కీలకమైన పథకం డేటా విషయంలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం విమర్శలకు తావిస్తోంది. పైగా పథకం అమలు తీరుతెన్నులపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలన్న స్పృహే కరువైంది. డబ్బులు విడుదల చేసి నెల కావొస్తుండడం ఒక ఎత్తయితే మలి విడత తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. కానీ ఇప్పటి వరకు జిల్లాల్లో అర్హత ఉండి పథకానికి దూరమయిన వారి సంఖ్య, అనర్హులుగా ప్రభుత్వం తేల్చిన వారి సంఖ్య కచ్చితత్వంతో అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. పైగా విద్యాశాఖ, సచివాలయ విభాగాలు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారే తప్ప పథకం లోపాలపై దృష్టిపెట్టడం, తల్లుల్లో ఉన్న గందరగోళానికి తెరదించుదామనే ప్రయత్నం జరగకపోవడం విస్మయం కలిగిస్తోంది. సచివాలయాల వారీగా జాబితా ప్రదర్శించామని చెబుతున్నప్పటికి అది కూడా ప్రహసనంలాగానే నడిచింది తప్ప చిత్తశుద్ధి కొరవడిందనే వ్యాఖ్యలు తల్లుల నుంచి వినిపిస్తున్నాయి

రోడ్డు ప్రమాదంలో సీఆర్పీ దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్పీ (ఇన్‌సెట్లో) మోషే ఫైల్

మేదరమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని వెంకటాపురం వద్ద మంగళవారం రాత్రి ముందు వెళ్తున్న మోటార్‌బైక్‌ను వెనుక వస్తున్న వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి అక్కడి అక్కడే దుర్మరణం చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. పంగులూరు మండలం రేణంగివరంకు చెందిన సీఆర్పీ మట్టకొయ్య మోషే (37), తంగిరాల సంతోష్‌కుమార్‌లు మోటర్‌బైక్‌పై మేదరమెట్ల వైపు నుంచి రేణంగివరం వెళ్తుండగా వెంకటాపురం వద్ద అదే రోడ్డులో వెనుక వస్తున్న తుపాన్ వాహనం మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోషే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న సంతోష్‌కుమార్‌కు గాయాలు కాగా వైద్యశాలకు తరలించారు.సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేణంగివరంలో విషాదం

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి):పంగులూరు మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న మట్టకొయ్య మోషే (37) మంగళవారం అర్ధరాత్రి 16వ నెంబరు జాతీయ రహదారిపై వెంకటాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన స్వగ్రామం రేణంగివరంలో విషాదం నెలకొంది. మోషే13 ఏళ్లగా పంగులూరు మండలంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య నాగేశ్వరమ్మతో పాటు విమోచన (9), కీర్తన (8), సుప్రియ(2) ఉన్నారు. పంగులూరు, కొరిశపాడు మండలాల విద్యాధికారులు కె.నాగభూషణం, జి.వీరాంజనేయులు, లాలం పున్నయ్య, సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు రమేష్‌తో పాటు సహచర సీఆర్పీలు, మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన మోషే భార్యకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సంఘప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రారండోయ్

భారీ ఈవెంట్‌గా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

గిన్నిస్ బుక్ అవార్డు సాధనే లక్ష్యం

నేడు అన్ని పాఠశాలల్లో పండుగలా కార్యక్రమం

పనుల్లో తలమునకలైన ఉపాధ్యాయులు

మార్గదర్శకాలు జారీ చేసిన ఉన్నతాధికారులు

జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ఒక మెగా ఈవెంట్‌ను తలపిస్తోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం తరహాలో ఈ మెగా పీటీఎంను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిష్ఠాత్మకమైన గిన్నిస్ బుక్ అవార్డు సాధనే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లను భారీగా చేస్తున్నారు. గత వారం రోజులుగా కార్యక్రమ పనులలోనే ఉపాధ్యాయులు, విద్యార్థులు తలమునకలవుతున్నారు. పీటీఎంకు ఏర్పాట్లు ఎలా చేయాలో పాఠశాల విద్యా డైరెక్టర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌లు ప్రతిరోజు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఏర్పాట్లలో టీచర్లను చేయిపట్టి నడిపిస్తున్నారు.

ఒంగోలు విద్య, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం)ను పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమగ్ర చర్యలు తీసుకున్నారు. ఈ పీటీఎం నిర్వహణకు సంబంధించి పాఠశాలల్లో సాక్షులను నియమించి వారి సంతకాలతో నివేదికలు, ఫొటోలు లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. ఏ విషయంలో కూడా రాజీ పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల ముఖద్వారాలకు మామిడి తోరణాలు, భవన పిల్లర్లకు కొబ్బరి ఆకులు, అరటి బోదెలు, చుట్టూ ఒక శుభకార్యం జరుగుతుందన్న భావన కల్పిస్తున్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ పీటీఎం నిర్వహణకు సంబంధించి కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

ఈ మెగా పీటీఎంకు హాజరుకావాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామ స్థాయి నాయకులకు, ఎస్ఎంసీ కమిటీలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు హెచ్‌ఎంలు, టీచర్లు స్వయంగా ఆహ్వానిస్తున్నారు. అందుకు సంబంధించి గత నెలరోజులుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ పీటీఎంకు హాజరుకావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అన్ని పాఠశాలల్లో సమావేశాలు ఘనంగా జరగనున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి వారి తరగతి గదిలో కూర్చోవాలి. అతిథులు, దాతలు, షైనింగ్ స్టార్ అవార్డు గ్రహీతలు, పూర్వ విద్యార్థులు హెచ్‌ఎం గదిలో కూర్చోవాలి. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలి. తల్లిదండ్రులకు తమ పిల్లల విద్యాప్రగతిని వివరించాలి. సమావేశంలో విద్యార్థులు ఏమి మాట్లాడాలి, తల్లిదండ్రులు ఏమి మాట్లాడాలో ముందుగానే వారిని సమగ్రంగా సిద్ధం చేయాలి. విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా పూర్వ విద్యార్థులు షైనింగ్ స్టార్స్ ప్రసంగాలు ఏర్పాటు చేయాలి. 4వ తరగతి నుంచి 10 వతరగతి చదువుతున్న విద్యార్థుల తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమం కింద మొక్క నాటాలి. అందుకోసం జిల్లావ్యాప్తంగా 1.96లక్షల మొక్కలు అందించనున్నారు.

తల్లిదండ్రులకు పోటీలు

మెగా పీటీఎంల సందర్భంగా తల్లిదండ్రుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు వారికి పోటీలు నిర్వహించాలి. తల్లులకు రంగవల్లులు, నిమ్మకాయ పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిచాలి. తండ్రులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించాలి. పిల్లలతో తల్లులకు వందనం పాదాభినందనం, పుష్పార్చన చేయించాలి. ఈ పోటీలను ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించాలి.

మధ్యాహ్న భోజనం మెనూ ఇదీ

మెగా పీటీఎం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అతిథులు, టీచర్లందరూ సహపంక్తి భోజనం చేయాలి. అందుకోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనానికి ప్రభుత్వం ప్రత్యేక మెనూ ప్రకటించింది. వెజిటబుల్ రైస్ పలావ్, అలుకుర్మా, ఉడికించిన గుడ్లు, రాగిజావతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి. భోజనం తీసుకున్న వారి వివరాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలు తీయాలి. ఈ కార్యక్రమం మొత్తానికి సంబంధించి మూడు మంచి ఫొటోలు, 30 సెకన్ల నిడివిగల వీడియోను లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

ఏఎంసీ చైర్మన్ పదవి రిజర్వేషన్ మార్పు

దర్శి, జూలై 9(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి రిజర్వేషన్ మార్పు జరగటంతో అయోమయం నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలల క్రితం రిజర్వేషన్లు ప్రకటించారు. ఆ జాబితాలో దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి జనరల్ మహిళ కేటగిరికి కేటాయించారు. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. దర్శి పట్టణానికి చెందిన దారా నాగవేణిని చైర్మన్‌గా నియమించాలని అధిష్ఠానానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర పెద్దలు కూడా ఆ ప్రతిపాదనలు ఖరారు చేసి జాబితాను విడుదల చేశారు. దీంతో దారం నాగవేణికి ఏఎంసీ చైర్మన్ పదవి ఖరారైనట్లు అందరూ భావించారు. తాజాగా చైర్మన్ పదవిని ఎస్సీ జనరల్‌కు కేటాయిస్తూ మార్కెట్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడటంతో టీడీపీ కూటమి క్యాడర్‌లో, ప్రజల్లో అయోమయం నెలకొంది. తొలుత ప్రకటించిన జాబితాను మార్చి ఇప్పుడు రిజర్వేషన్లు మార్చటంతో గందరగోళ పరిస్థితి నెలకొంటుందని క్యాడర్ ఆందోళన చెందుతోంది.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

▸ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలం లోని ఇమ్మడిచెరువు సచివాలయాన్ని ఆయన ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి ఒక్కరే ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. హాజరు పట్టిలో రోజువారీ సంతకాలు లేవని గుర్తించి ఉన్నతాధికారులతో మాట్లాడి వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ఉద్యోగ స్తులు ఈవిధంగా చేయడం సరికాదన్నారు. అనం తరం ఇమ్మడిచెరువు జడ్పీ హైస్కూల్‌లో ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులను సన్మానించి నగదు ప్రోత్సాహం అందజేశారు. పాఠశాలలో బీసీ హస్టల్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పా ల్గొన్నారు.

గన్నవరం బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

మండలంలోని గన్నవరం గ్రామస్థులకు ఎన్నికల్లో ఇచ్చిన హా మీ మేరకు ఆగిఉన్న బ్రిడ్జి నిర్మా ణానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర రూ.2.20కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించా రు. బుధవారం ఆయన పనుల ను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఎం ఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, పా ర్టీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, చౌడారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే దామచర్ల



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని 30, 32వ డివిజన్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకోగా కొందరు పించన్లు, ఇంటి స్థలాలు, రేషన్‌కార్డుల లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయా డివిజన్లలోని సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వాటిని సత్వరమే పరిష్కరించాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. తాను కూడా డివిజన్‌లలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి, అవసరమైన పథకాలు అందరికీ చేయాలన్నదే లక్ష్యమన్నారు. పేదరికం లేని సమాజ స్థాపన కోసం ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తుందని వివరించారు. గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఇంట్లో ఒక పిల్లవాడికే డబ్బులు ఇవ్వగా నేడు తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.13వేలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, పింఛన్లు పెంపు తదితర పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల కోసం అర్హులు తమ దరఖాస్తులను సచివాలయంలో అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కె. వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు నత్తల కనకరావు, నత్తల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ తూము సుబ్బారావు, కంకణాల వెంకట్రావు, ఆరిగ శంకర్, ఆరిగ శైలజ పాల్గొన్నారు.



చందలూరులో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంటల బీమా నమోదు చేసుకోండి

● ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్‌లో సాగు చేపట్టిన పంటలకు తగిన ప్రీమియం చెల్లించి బీమా చేయించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. (ఎకరా) వరికి రూ.800 లు, మిరపకు రూ. 1200లు, కంది, మినుముకు రూ. 400 ప్రీమియం చెల్లించాలన్నారు. పత్తి పంటకు వాతావరణ ఆధారిత బీమా పొందేందుకు 1900 రూపాయలు చెల్లించాలని తెలిపారు. కౌలు రైతులు తగిన గుర్తింపు కార్డు కలిగి ఉంటేనే ప్రభుత్వ రాయితీలు పొందగలుగుతారని తెలిపారు. రైతులు పొగాకు సాగు చేపట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీప్రియ, స్థానిక నేతలు మురకొండ సుబ్బారావు, పి.వేణు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా ఎరువుల సరఫరా

మార్టూరు,జూలై9(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి గ్రామంలో పీఏసీఎస్ ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేసే విధంగా చర్యలు చేపడతామని మార్టూరు ఏడీఏ కె. సుదర్శన్ రాజు అన్నారు. బుధవారం కోలలపూడి గ్రామంలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి వ్యవసాయ అధికారిణి లావణ్య అధ్యక్షత వహించారు. తరువాత సమావేశంలో సుదర్శన్‌రాజు మాట్లాడుతూ రెండవ వారం నుంచి పంట నమోదు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తాటి నాగార్జున,వీఏఏ గోపికిరణ్, తదితర రైతులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు, చీరలు బహూకరిస్తున్న వ్యాపారవేత్త

వృద్ధులను ఆదుకోవడం బాధ్యత

పర్చూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నిరాదరణకు గురైన వృద్ధులను ఆదుకోవటం బాధ్యతగా గుర్తించాలని వ్యాపార వేత్త తులసి భువనేశ్వరరావు అన్నారు. శ్రీ కృష్ణ చామండేశ్వరి మహర్షి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పర్చూరులోని వృద్ధాశ్రమాల్లో బుధవారం వృద్ధులకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బాలికల పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, కొల్లా రాజేశ్వరరావు(రాజా), కంచనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ

మార్టూరు,జూలై9(ఆంధ్రజ్యోతి):స్థానిక వెంకయ్య ఆశ్రమంలో గ్రానైట్ పరిశ్రమ యజమాని పొత్తూరి వెంకట శివరావు కుటుంసభ్యులు బుధవారం పేదలకు,వృద్ధులకు అన్నదానం చేసి,వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. అంతేగాకుండా ఆశ్రమ నిర్వాహకులు శివరాజేష్,అంజలి దంపతులకు కూడా నూతన వస్త్రాలను అందజేశారు. అలాగే ఆశ్రమం అభివృద్ధికి సహాయ సహకారాలను అందిస్తానని వెంకట శివరావు తెలిపారు.

నేడు గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకస్వామి సర్వేపల్లి దివ్యరూపాచారి తెలిపారు. ఉదయం హారతి, పంచామృతాభిషేకం, చతుర్వేద పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త యామిని నాగేశ్వరరావు, లక్ష్మీకాంతం దంపతులు తెలిపారు.

13న బల్లికురవలో ఉచిత మెగా వైద్య శిబిరం

బల్లికురవ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 13 వ తేదీన నర్సారావుపేట తేజ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల అధినేత డాక్టర్ బొట్ల రఘుప్రసాద్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల సాధారణ వ్యాధులకు, అలాగే స్త్రీల వ్యాధుల నిపుణుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రావినూతల గంగమ్మగుడిలో చోరీ

మేదరమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతలలో పురాతనమైన గంగమ్మగుడిలో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి గంగమ్మ గుడిలో దొంగలు ప్రవేశించి అక్కడ ఉన్న సీసీ కెమెరాలు,హార్డ్ డిస్క్, అమ్మవారి మెడలోని నాలుగు తాళిబొట్టులను దొంగలు ఎత్తుకు వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఊరి నడిబోడ్డులో ఉన్న గంగమ్మ గుడిలో చోరీ జరగడం పట్ల గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. క్లూస్ టీం గంగమ్మ తల్లి గుడి వద్దకు వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించింది. అక్కడ ఉన్న వేలిముద్రలను సేకరించారు.కొరిశపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు మేదరమెట్లకు మంత్రి రవికుమార్

మేదరమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె. వెంకట మురళిలు హాజరు అవుతున్నారు. గురువారం ఉదయం 11 గంటలు మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొంటారు.

ఓటరు జాబితాల స్వచ్ఛీకరణకు చర్యలు

చీమకుర్తి, జూలై9(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని రాజకీయపార్టీల ప్రతినిధులు, తహసీల్దార్‌లతో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వరకుమార్ సమావేశమయ్యారు. ఓటర్ల సవరణ, నూతన ఓటర్లు చేరికలు, అర్హత లేనివారివి తొలగింపులు తదితరాలకు పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ పక్కాగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఐసీని పరిరక్షించుకోవాలి

ఒంగోలు(రూరల్), జూలై9(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఐసీఈయూ కార్యదర్శి పారా శ్రీనివాసరావు కోరారు. సార్వత్రికసమ్మెలో భాగంగా బుధవారం ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉద్యోగులు, ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. దానిని కాపాడుకోవటానికి ఎలాంటి ఉద్యమాలకు, త్యాగాలకు వెనుకాడబోమని చెప్పారు.

అవీ.. ఇవీ



జార్లపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సింగయ్య

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

అద్దంకిటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జార్లపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో బత్తిన సింగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉండాల్సిన చిన్నారులలో కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. ఆ ఉన్న నలుగురు చిన్నారులకు పాలు గుడ్లు వంటివి ఇవ్వలేదని గుర్తించారు. చిన్నారులు కూర్చోడానికి ఇచ్చిన కార్పెట్‌ను వాడకపోవడం, ఇతర లోపాలను ఎంపీడీవో గుర్తించారు. వెంటనే సీడీపీవోకు ఫోన్ చేసి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టిపెట్టి వాటిని సక్రమంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. కేంద్రాలలో చిన్నారుల హాజరు, వారికి ఇవ్వాల్సిన పోష్టికాహారంలోను, కల్పించాల్సి వసతుల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



కొండమూరులో డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాలి

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నివాస ప్రాంతాలతో పాటు పబ్లిక్ ప్రదేశాల నుంచి నిత్యం తడి,పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి సూచించారు. బుధవారం మండలంలోని జనకవరం, కొండమూరు గ్రామాలలో చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్‌లకు తరలింపు ప్రక్రియను స్థానిక సిబ్బందితో కలసి పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లకు తరలించిన చెత్తను తడి, పొడిగా వేరుచేసి ప్రాసెసింగ్ చేయాలని అన్నారు. చెత్తను ఎరువుగా మలిచేందుకు వానపాములు వినియోగించాలన్నారు. గ్రామాలలో వీధుల పక్కన, ప్రభుత్వ స్థలాలలో చెత్తకుప్పలు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జునరావు, అనిల్‌కుమార్, రాంబాబు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి మహిళలు

వైసీపీనేతలది బుద్ధిహీన స్వభావం

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఓటమి పాలై ఇంటికే పరిమితమైన వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని, మహిళలపై అభాండాలు వేయడం ఆపార్టీ బుద్ధిహీన స్వభావం అని పలువురు కూటమి మహిళలు పేర్కొన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ వ్యక్తిగత దూషణలను నిరసిస్తూ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణిపై వైసీపీ నేతలు దుర్మార్గం మాట్లాడిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అలాగే కొంతకాలం క్రితం అమరావతి మహిళలపై మాట్లాడిన తీరును వివరించారు. తాజాగా కోవూరు శాసనసభ్యురాలిపై మాట్లాడిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, తదితర మహిళలు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మల రామానాయుడితో మాట్లాడుతున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య

ఎత్తిపోతల అభివృద్ధికి సహకరించండి

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఉన్న మూడు ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కొండయ్య జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. బుధవారం మర్యాదపూర్వకంగా సచివాలయంలో మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. ఈసందర్భంగా ఖరీఫ్‌లో సాగుకు సంబంధించిన సమస్యలపై మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నేడు పంగులూరులో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం పంగులూరులో పర్యటించనున్నారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మార్కెట్‌యార్డ్‌లో నిర్వహిస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పరిశీలించనున్నారు.

నేడు మండల సమావేశం

పంగులూరు మండల పరిషత్ సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సంబంధిత ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

పర్చూరును అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

వర్క్‌షాపులో ఎమ్మెల్యే ఏలూరి

మార్గదర్శకులుగా ముగ్గురి ఎంపిక

మార్టూరు,జూలై9(ఆంధ్రజ్యోతి): పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలపాలన్నదే ప్రగతి విజన్ 2047 లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అన్నారు.బుధవారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా పీ4,పర్చూరు ప్రగతి విజన్‌పై వివిధ శాఖల అధికారులతో వర్క్‌షాపు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో స్వర్ణాంధ్ర విజన్‌కు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. పీ 4 తో రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు.అదేవిధంగా నియోజకవర్గంలో పేదకుటుంబాలవారికి సాయం చేసేందుకు పిఫోర్ లో భాగంగా కొల్లా అశోక్, వెంకట్, స్వర్ణ బాలు లను మార్గదర్శకులుగా ఎంపిక చేశామని, వారు పేదవారికి సాయం చేసేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు .పీ ఫోర్ లో భాగంగా ఒక్కో మండలానికి 10 మంది చొప్పున 6 మండలాల్లో 60 మందికి సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ పొగాకు రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయించడంలో ఎమ్మెల్యే ఏలూరి కృషిని రైతులు జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. మరో ముఖ్య అతిథి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి చేపట్టిన అభివృద్ధి పథకాలు ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఏపీ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, ఆరు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి, పక్కన మారి టైం బోర్డు చైర్మన్ సత్య, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టరు పెద్దపూడి విజయకుమార్

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పర్యావరణాన్ని కాపాడుకుంటే మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకున్నట్లేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని పొలాల్లో ఉపాధి హామీ పథకం క్రింద గ్రామానికి మంజూరయిన కొబ్బరి మొక్కలను ఎమ్మెల్యే ఏలూరి గ్రామ నాయకులతో కలిసి నాటారు. అనంతరం ఆయన పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు, చింతలపూడి శ్రీనివాసరావు,ఉప్పలపాటి అచ్చిరాజు,కల్లేపల్లి శ్రీనివాసరాజు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

భవనాసి చెరువు కట్ట మట్టి అక్రమ తరలింపు

పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



గ్రావెల్ తవ్వకాలతో కాలువ కట్ట స్థానంలో ఏర్పడ్డ గొయ్యి (ఇన్‌సెట్లో) పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ నారాయణస్వామి

అద్దంకి,జూలై9(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నది నుంచి భవనాసి చెరువు కు వచ్చే కాలువ కట్టల గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తుండటంతో కట్టలు కనుమరుగు అయ్యాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నేతలు కాలువ కట్టల మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతలు కూడా అదే దారిన నడుస్తుండటంతో కట్టలు పూర్తిగా కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంది. కాలువ కట్టల మట్టితో పాటు ఆ ప్రాంతంలో మరింత లోతుగా తవ్వుతుండటంతో కట్ట ప్రాంతం కాలువను తలపించేలా మారుతుందని పలువురు విమర్శిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ నారాయణస్వామి బుధవారం గ్రావెల్ తరలించిన ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ నారాయణస్వామి తెలిపారు. అదే విధంగా భవనాసి చెరువు అలుగు వాగులో కూడా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్‌లపై కార్మికుల నిరసన

పలు చోట్ల ర్యాలీలు, మానవహారాలు

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్ వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, ఇవి కేవలం ఆయా యజమానులకు మాత్రమే సంతృప్తినిస్తాయని ఐటీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పేర్కొన్నారు. సార్వత్రిక సమ్మెను బుధవారం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వసంతరావు, గోసాల సుధాకర్, కాలేషా, రామకృష్ణ, అమీర్, బాబ్జీ, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.



చీరాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

బిల్లులను రద్దు చేయాలి

అద్దంకిటౌన్ : కార్మికులు హక్కులను కాలరాసే లేబర్ కోడ్ బిల్లును రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా అద్దంకిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు కేఎల్‌డీ ప్రసాద్, సీఐటీయూ మండల అధ్యక్షురాలు జి.శారద, వివిధ యూనియన్‌ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్మికులు

బల్లికురవలో

బల్లికురవ : బల్లికురవలో సీపీఎం నేతలు, సీఐటీయు నేతలు, అంగన్ వాడీ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నేతలు సీహెచ్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో

పంగులూరు : పంగులూరులో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె జరిగింది. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులను మూసివేయించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన కూడలివరకు ర్యాలీ చేసి అక్కడ మానవహారం నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు, రైతు సంఘం జిల్లా నాయకులు రాయిణి వినోద్‌బాబు, తలపనేని రామారావు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

చినగంజాంలో

చినగంజాం : కార్మికులకు శ్రమను పెంచే లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక మండల కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. మండల సీఐటీయూ నాయకులు జీవి.రాంప్రసాద్‌రెడ్డి, డి.రాఘవులు, సీ.హెచ్.శ్రీను, పుల్లారావు, అనీల్, పీ.ఆదాం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పంచాయతీ, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

సంతమాగులూరులో..

సంతమాగులూరు: సీఐటీయూ ,ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్యకర్తలు, ఐసీడీఎస్ , తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనను తెలియజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నాయకులు గంగయ్య, విజయ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాదర్ బాష, మేకల రమణయ్య, చీదర్ల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో

ఇంకొల్లు : ఇంకొల్లులో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె జరిగింది. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య , రైతుసంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, శంకరరావు, భానుప్రసాద్, గోవిందరాజు, సుజాత, అంగన్‌వాడీ , ఆశ, పంచాయితీ కార్మికులు పాల్గొని గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

పర్చూరులో

పర్చూరు : కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం తీసుకు వచ్చిన నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయు నాయకులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో ఎర్ర జండాలు చేపట్టి స్థానిక బొమ్మల సెంటర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు నరిశెట్టి ఆచార్యులు, కౌలు రైతు సంఘం నాయకులు బండి శంకరరావు, సీపీఎం నాయకులు మత్తె డేవిడ్, బండారు చినదాసు, చింతగుంట శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మార్టూరులో ర్యాలీ

మార్టూరు :కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని అందరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా బాధ్యులు బత్తుల హనుమంతరావు అన్నారు. బుధవారం జరిగిన సమ్మెలో భాగంగా మార్టూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగనవాడీ, ఆశా కార్యకర్తలు, వీవోఏ సంఘం సభ్యులు, బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకులు, హమాలీ యూనియన్ నాయకులు,వివిధ కార్మిక సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాలెపు సాంబయ్య, వీ రవల్లి కృష్ణమూర్తి, సూరిబాబు, శేషాద్రి, అంగన్‌వాడీ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఎర్ర జెండాలతో నిరసన ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు

ఫసల్ బీమాలో నమోదు కావాలి



అర్హుల లిస్టును నోటిస్‌బోర్డులో పెడుతున్న అధికారులు

బల్లికురవ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజనలో ప్రీమియం నగదు చెల్లించి పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం, వైదన గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల వివరాలను, బీమా పథకాల వివరాలను నోటీస్ బోర్డులో పెట్టారు. ఏఈవో మౌలాలి, వీఏఏ రమణ, శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం

అద్దంకిటౌన్ : అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని వ్యవసాయ సహాయకులు(ఏడీఏ) బి. ఏఫ్రాయిం అన్నారు. బుధవారం మండలంలోని నాగులపాడు, వెలమూరిపాడు గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండి జాబితాలో పేర్లు లేని రైతులు గ్రీవెన్స్‌లో నమోదుకు ఈనెల 13వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. గ్రీవెన్స్ కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్సై వెంకటేశ్వర్లు

మత్తు పదార్థాలపై దుకాణాల్లో ముమ్మర సోదాలు

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల టూటౌన్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిధిలో దుకాణాలు, అనుమానిత ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. దుకాణదారులకు హెచ్చరికలు చేశారు. సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా సోదాలు జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు లోనై జీవితాలను వృథా చేసుకోవద్దు

పర్చూరు : చెడు అలవాట్లకు లోనై జీవితాలను వృథా చేసుకోవద్దని ఎస్సై జీవీ చౌదరి అన్నారు. రాష్ట్ర పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్చూరులోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల సమీపంలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై సురేష్ రెడ్డి, శారదా హైస్కూల్ కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో కలిసి పంటలను పరిశీలిస్తున్న ఏవో రామమోహన్‌రెడ్డి

త్వరలో మేదరమెట్లలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం

మేదరమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి):మేదరమెట్లలో త్వరలో హెచ్‌డీ నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని మండల వ్యవసాయ అధికారి ఎస్. రామమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రాచపూడి, మేదరమెట్ల గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తేమశాతం 20 కంటే ఎక్కువ ఉండకూడదని, పచ్చ, నల్ల ఆకులు గ్రేడింగ్ చేసి కొత్త వారికి చెక్కులు కట్టుకోవాలని రైతులకు తెలియజేశారు. హెచ్‌డీఎక్స్ రూ. 6వేలు, హెచ్‌డీఎం రూ. 9వేలు, 12 వేలు చొప్పున మూడు గ్రేడ్‌లుగా నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 30వ తేదీలోపు ప్రధాన మంత్రి పంటల బీమా పథకం ద్వారా రైతులు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాల వలన భూమికి కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



బైటమంజులూరు పొలాలలో కాలిపోతున్న సుబాబుల్ తోట

మంటలు అంటుకుని సుబాబుల్ తోట పాక్షిక దగ్ధం

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని బైటమంజులూరు గ్రామ పొలాలలో మంటలు అంటుకుని సుబాబుల్ తోటకు పాక్షిక నష్టం వాటిల్లింది. గ్రామంలోని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పంటించడంతో సమీపంలో ఉన్న సరికొండ నరసరాజుకు చెందిన సుబాబుల్ తోటకు మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించిన గ్రామ యువకులు అప్రమత్తమయి అద్దంకి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. సుబాబుల్ తోటకు మంటలు వ్యాపించడంతో రూ. 50 వేలవరకు పంట నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మార్టూరు,జూలై9(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోరె వెంకటేశ్వరరెడ్డి (68)మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సైదా బుధవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు మృతుడి స్వగ్రామం ఉమ్మడి ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం తిరుమలరెడ్డిపల్లి. ఆయన కుమారుడు చంద్రశేఖరరెడ్డి బల్లికురవ మండలం కొప్పెరపాలెం లో గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్నారు.అయితే నాలుగు రోజుల క్రితం కొప్పెరపాలెంలోని కుమారుని దగ్గరకు వచ్చిన వెంకటేశ్వరరెడ్డి విజయవాడలో ఉన్న మరో కుమారుని దగ్గరకు వెళ్లేందుకు ఈ నెల 7 వతేదీన సోమవారం ద్విచక్రవాహనంపై కుమారునితో కలిసి మార్టూరు వస్తున్నారు. ఈ క్రమంలో మార్టూరు,నాగరాజుపల్లి గ్రామాల మధ్య పెట్రోలు బంకు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొన్నది.ఈ ప్రమాదంలో గాయపడిన తండ్రి,కుమారులను నరసరావుపేటలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తండ్రి వెంకటేశ్వరరెడ్డిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా,అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి మృతునికి పోస్టు మార్టం నిర్వహించామని, మృతదేహాన్ని అతని స్వగ్రామానికి బంధువులు తీసుకు వెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురిపై అట్రాసిటీ కేసు


ఈపూరుపాలెం(చీరాల), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కుల దూషణకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై ఈపూరుపాలెం పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని బుర్లవారిపాలెంకు చెందిన తెలగతోటి కిషోర్‌కు, తోటవారి పాలెంకు చెందిన ఉప్పాల చంద్రశేఖర్‌కు భూ వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో ఇటీవల పొలంలో తనపై కుల దూషణ చేశారంటూ కిషోర్ ఎస్సీఎస్టీ ట్రయిల్‌కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఈపూరుపాలెం పోలీసులు చంద్రశేఖర్‌తో పాటు మరో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 10 జూలై 2025

దర్గాలో భక్తులకు గంధం పంచుతున్న ముస్లిం మత పెద్దలు

తరగని విశ్వాసం

నాల్గవ రోజూ తగ్గని భక్తుల రద్దీ • భక్తిశ్రద్ధలతో తహలీల్‌ఫాతేహా • నేడు పండుగ ముగింపు సభ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తరలివచ్చిన భక్తజనంతో 'స్వర్ణాల' తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నెరవేరిన కోరికలతో కొందరు.. కొత్త కోరికలతో ఇంకొందరు రొట్టెలను మార్చుకున్నారు. రొట్టెల పండుగలో నాల్గవ రోజు బుధవారం రోజంతా చెరువు ఘాట్ వద్ద రద్దీ నెలకొంది. ఈ ఒక్కరోజే రెండు లక్షలమంది కిపైగా భక్తులు వచ్చి ఉంటారని అంచనా. తమకు కావాల్సిన వరాల రొట్టెలను పట్టుకుని, బారాషహీదు లను సందర్శించుకుని పూజలు, మొక్కులు తీర్చుకున్నారు. ఉద్యోగం, ప్రమోషన్, వివాహ, విద్య రొట్టెలకు డిమాండ్ కనిపించింది. బారాషహీద్ దర్గా కమిటీ సారథ్యంలో దర్గాలో తహలీఫాతేహాను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమరుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, దువాలు నిర్వహించారు. మాదిగ కార్పొరేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి దర్గాలో పూజలు చేసి స్వర్ణాల చెరువులో ఆరోగ్య రొట్టె పట్టుకున్నారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఇతర ఉన్నతాధికారులు దర్గాలో కలియతిరుగుతూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు ఎస్పీ డి.సౌజన్య తదితరులు పోలీసు బందోబస్తు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్వర్ణాలచెరువు వద్ద వృద్ధులు, దివ్యాంగులకు పోలీసులు సహకరించారు. బోట్ క్లబ్‌లో గత నాలుగు రోజులుగా దాదాపు 4వేల మందికిపైగా భక్తులు బోట్ షికార్ చేయగా, పర్యాటక అభివృద్ధి సంస్థకు దాదాపు రూ.6.8 లక్షలు ఆదాయం వచ్చింది. కాగా, బోట్ క్లబ్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం రొట్టెల పండుగ ముగింపు సభ జరుగుతుంది. పండుగను విజయవంతం చేసేందుకు శ్రమించిన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సత్కరించనున్నారు.



సాయంసంధ్యవేళ స్వర్ణాల చెరువు ఘాట్‌లో భక్తుల సందడి

నేడు గురుపౌర్ణమి



నెల్లూరు : బాలాజీనగర్ సాయిదర్బార్ వద్ద సీతారామచంద్రుల ఊరేగింపు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గురు పౌర్ణమి పర్వదినానికి జిల్లాలోని ఆలయాలు, సాయిబాబా మందిరాలు సిద్ధమయ్యాయి. శైవాలయాల్లో గురు మేధా దక్షిణామూర్తి స్వామికి, వైష్ణవాలయాల్లో హయగ్రీవుడికి, వ్యాస మహర్షికి గురువారం విశేష పూజలు జరగనున్నాయి. ఇక, సాయిబాబా మందిరాల్లో పెద్ద ఎత్తున ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యా యి. నెల్లూరు గాంధీబొమ్మ సెంట ర్‌లోని షిరిడీ సాయి మందిరంలో గురువారం నుంచి 8 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మం దిరం చైర్మన్ మన్నెం అమర నాథ్‌రెడ్డి తెలిపారు. ప్రతీరోజు ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామార్చన జరుగుతాయని పేర్కొన్నారు. కాగా, బాలాజీనగర్ అద్దాల సాయిబాబా మందిరంలో బుధవారం గురు పౌర్ణమి ఉత్సవాలు మొదలయ్యా యి. ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండ రామ ఆలయం నుంచి శ్రీరామ చంద్రుడు సీతాలక్ష్మణ హనుమత్స మేతుడై ఊరేగింపుగా సాయి దర్బార్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా విశేష పూజలు, అన్నదానం జరిగాయి.

పట్టణాలకు మహర్దశ

అమృత్ 2.0 కింద మౌలిక వసతులకు భారీగా నిధులు • నాలుగు జిల్లాలకు రూ.1622.63 కోట్లు

23 మున్సిపాలిటీల్లో ఇంటింటికి తాగునీరు • నెల్లూరులో మురుగునీటి నిర్వహణకు రూ.230 కోట్లు

రెండేళ్లలో పనులు చేయాలని లక్ష్యం • టెండర్లు ఆహ్వానించిన పబ్లిక్ హెల్త్ అధికారులు

పురపాకల సంఘాలకు మహర్దశ పట్టనుంది. కనీస మౌలిక వసతులైన మంచినీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి వంటి పనులు చేపట్టేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులు చేపట్టనుంది. ఇటీవల కాలంలో ఈ స్థాయిలో మున్సిపాలిటీలకు నిధులు మంజూరవడం ఇదే ప్రథమం. పబ్లిక్ హెల్త్ విభాగం ఈ పనుల నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. 4 జిల్లాల పరిధిలో రూ.1,622.63 కోట్లను కేటాయించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీలకు ఇంటింటికీ తాగునీటి సరఫరాకు గానూ 310.37 కోట్లు మంజూరయ్యాయి. నీటి వనరుల అభివృద్ధికి రూ.22.33 కోట్లు దక్కాయి. నెల్లూరులో మురుగునీటి శుద్ధి నిర్వహణకు రూ.230.23 కోట్లు కేటాయించడం విశేషం.

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలకు అమృత్ 2.0 పథకం కింద రూ.10,251 కోట్లను మంజూరు చేయగా అందులో పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్‌కు రూ.1,622.63 కోట్లను కేటాయించారు. ఈ సర్కిల్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలు ఉండగా, 23 అర్బన్ లోకల్ బాడీలకు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) నిధులను విభజించారు. ఆయా మున్సిపాలిటీల్లో అవసరాలను బట్టి నిధులు కేటాయించారు. అమృత్ 2.0 పథకం కింద నిధులను మూడు విభాగాలకు ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. అందులో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి ఉన్నాయి. ఈ దఫా ఇంటింటికీ తాగునీటిని కుళాయిల ద్వారా ఇవ్వాలన్నది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసమే సింహభాగం నిధులను కేటాయించారు. ఒక్క ఒంగోలు కార్పొరేషన్‌కే రూ.224.42 కోట్లు మంజూరు చేశారు. పొదిలి, దర్శి, నెల్లూరు, వెంకటగిరి పట్టణాలకు కూడా భారీగా నిధులు దక్కాయి. ఇక నెల్లూరులో మురుగునీటి శుద్ధి నిర్వహణకు రూ.230.23 కోట్లు కేటాయించడం విశేషం. ఈ నిధులతో నెల్లూరు నగరంలో పెండింగ్ ఉన్న తాగునీటి, యూజీడీ పనుల్లో పురోగతి కనిపించనుంది. అలానే దాదాపుగా అన్ని మున్సిపాలిటీల్లో అక్కడ ఉన్న నీటి వనరులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు నిధులు మంజూరు చేశారు.

అమృత్ 2.0 కింద వివిధ మున్సిపాలిటీలకు మంజూరైన నిధుల వివరాలు...

మున్సిపాలిటీ	తాగునీటి సరఫరా (రూ.కోట్లు)	మురుగునీటి నిర్వహణ (రూ.కోట్లు)	నీటివనరుల అభివృద్ధి (రూ.కోట్లు)
నెల్లూరు	112.28	230.23	4.20
కావలి	15.26	----	3.20
బుచ్చి	7.91	---	1
అల్లూరు	14.98	---	1.15
ఆత్మకూరు	14.02	--	2.10
కందుకూరు	34.66	----	7.54
గూడూరు	26.11	---	4.50
వెంకటగిరి	114.84	---	---
సూళ్లూరుపేట	1.47	----	5
నాయుడుపేట	3.50	----	1.18

మొత్తంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీలకు సంబంధించి ఇంటింటికీ తాగునీటి సరఫరాకు గానూ 310.37 కోట్లు మంజూరవడం గమనార్హం. నీటి వనరుల అభివృద్ధికిగానూ రూ.22.33 కోట్లు దక్కాయి.

• రెండేళ్లలో పూర్తి

అమృత్ 2.0 పథకం కింద పబ్లిక్ హెల్త్ అధికారులు రూ.1622.63 కోట్ల విలువైన పనులకు టెండర్లు ఆహ్వానించారు. గత నెల 30న టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈ నెల 28 వరకూ బిడ్ల దాఖలుకు అవకాశం కల్పించారు. 23 మున్సిపాలిటీల్లో 73 వర్కులుగా విభజించారు. వాటన్నింటినీ ఒకే ప్యాకేజీగా టెండర్ పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. నెల రోజుల్లోపు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆ వెంటనే పనులు మొదలు పెట్టించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ పనులు మొదలైతే అన్నీ మున్సిపాలిటీల్లో అభివృద్ధి హడావిడి కనిపిస్తుంది. కాగా ఈ పనులపై పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 23 అర్బన్ లోకల్ బాడీల్లో 73 పనులకు గాను టెండర్లు పిలిచినట్లు తెలిపారు.



కావలి : ట్రంకురోడ్డులో కార్మికుల ప్రదర్శన

నిరసన గళం

జిల్లావ్యాప్తంగా సార్వత్రిక సమ్మె

కార్మికుల నిరసన ర్యాలీలు, మానవహారాలు

దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా కార్మికులూ సమ్మెలో పాల్గొన్నారు. కార్మిక జెండాలు చేతబట్టుకుని కార్మికుల నినాదాల హోరెత్తించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి వాటి స్థానంలో లేబర్‌కోడ్‌లను తీసుకురావడం కార్మికుల గొంతు కోయడమేనంటూ నిరసనకారులు ఆగ్రహంవ్యక్తం చేశారు. ఇప్పటికైనా లేబర్‌కోడ్‌లను వెనక్కి తీసుకుని కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

- వివరాలు లోపలిపేజీల్లో..

'ఉపాధి' సొమ్ము భోక్తలపై వేటు

ఆరుగురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

కలువాయి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఉపాధి హామీ పథకం సొమ్మును స్వాహా చేసిన ఉద్యోగులపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. ఇందుకు బాధ్యులయిన ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకుడు ఏ.మ హేంద్ర రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ పీ.బాబు రాజేష్, ఇన్‌చార్జి ఇంజనీరింగ్ అసిస్టెంట్ జే.శీన య్య, సాంకేతిక సహాయకులు ఆర్.ప్రసన్న, ఎంవీ. ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లులను సస్పెండ్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసును నమోదు చేశారు. అంతేకాక వారందరిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ డ్వామా పీడీ గంగాభవాని బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే..

• జాబ్‌కార్డులతో సంబంధం లేకుండా...

2023-24లో చిన్నగోపవరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కుటుంబాల జాబ్‌కార్డుల్లో గ్రామానికి సంబంధం లేని 148 మంది బయటవ్యక్తులను చేర్పించారు. వారంతా ఉపాధి పనులకు హాజరైనట్లు బోగస్ మస్టర్లు వేసి, భారీగా నిధులు స్వాహా చేశారు.అంతేకాక ఇప్పటి వరకు జరిగిన పలు పనుల్లో సిబ్బంది బోగస్ కొలతలు నమోదు చేసి, భారీగానే ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారు. ఈ విషయం 16వ విడత సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసింది. ఈఒక్క గ్రామంలోనే సుమారు రూ.59లక్షలు అవినీతి జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ అక్రమాలపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి బీ. భవానీహర్ష గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. అక్రమాలు బయటపడడంతో ఆరుగురు సిబ్బందిని శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించారు.



గవర్నర్ నజీర్ నుంచి ఉత్తమ సేవా అవార్డును అందుకుంటున్న రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్ వాకాటి విజయకుమార్ రెడ్డి

రెడ్‌క్రాస్‌కు ఉత్తమ సేవా పురస్కారం

నెల్లూరు (వైద్యం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు శాఖ అందిస్తున్న సేవలకు ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. ఈ అవా ర్డును బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి నెల్లూరు శాఖ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైఎస్ చైర్మన్ చమర్తి జనార్దన్‌రాజు అందుకున్నారు. జిల్లాలోని అనేక కార్యక్రమాలలో సేవలు అందించిన రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యంకు కూడా ఉత్తమ సేవా అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ సేవలను కొనియాడారు. రెడ్‌క్రాస్ కమిటీ రాష్ట్ర చైర్మన్ రామారావు, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా మాట్లాడుతూ దేశంలోనే నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలకు మంచి గుర్తింపు ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు డాకారపు రవిప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



అందరి సహకారంతోనే

కరేడులో భూసేకరణ!

'ఆంధ్రజ్యోతి'తో కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజ

ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం భూసేకరణ ప్రక్రియను రైతులకు అర్థమయ్యేలా వారి సందేహాలు నివృత్తిచేసి ప్రజల సహకారంతోనే ముందుకు వెళతామని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ అన్నారు. భూములకు సరియైన ధర రాదన్న ఆందోళన కొందరిలోను, చేపల వేటకు అవకాశం ఉండదేమోనన్న భయాందోళన మత్స్యకారుల్లోనూ, కొన్ని కాలనీలు ఖాళీ చేయాల్సి ఉన్నందున వారికి ఎక్కడ పునరావాసం చూపిస్తారోనన్న సందేహం ఉందని అన్నారు. వీటన్నిటికీ స్పష్టమైన హామీలు ఇవ్వడం, వారిలో నమ్మకం కల్పించి వారి ఆమోదంతోనే భూసేకరణ ప్రక్రియను కొనసాగించనున్నట్లు చెప్పారు. రైతుల ఆందోళనలు, వారు వ్యక్తంచేసిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించామని, ఈ సమస్యపై ఉన్నతస్థాయిలోనూ చర్చ జరుగుతోందని వివరించారు. కరేడులో భూసేకరణపై నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సబ్ కలెక్టరు శ్రీపూజ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- వివరాలు 8లో...

సీఎంతో చర్చించి

రైతులకు న్యాయం జరిగేలా చూస్తా

• ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు కోసం కరేడు గ్రామంలో భూసేకరణపై రైతుల అభిప్రాయాలను తెలుసుకోనున్నామని, వారి సందేహాలను 2, 3 రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరేడులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన రైతులను బుధవారం పిలిపించి వారి అభిప్రాయాలు తీసుకున్నట్లు చెప్పారు. రైతుల్లో రకరకాల అపోహలు సృష్టించడం వల్లే గందరగోళం నెలకొందన్నారు. ఒక భారీ పరిశ్రమ ఏర్పాటు కావాలంటే కొన్ని గ్రామాలకు నష్టం జరగడం సహజమని, అందుకు ప్రాంత అభివృద్ధి, పరిశ్రమ రాక కోసం కరేడు రైతులు సహరించాలని కోరారు.

మాలకొండ సమీపంలో

ఎంఎస్ఎంఈ పార్కు

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం మాలకొండ, అయ్యవారిపల్లె గ్రామాల మధ్య ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కానుంది. బీపీసీఎల్ పెట్రో రిఫైనరీ, పెట్రో కెమికల్స్ తయారీ పరిశ్రమ, ఇండోసోల్ సోలార్ ఎనర్జీ పరిశ్రమలకు అనుబంధగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు అవసరం ఉంటుందని గుర్తించిన అధికారులు అయ్యవారిపల్లె సమీపంలో ఎంఎస్ఎం పార్కు కోసం భూమిని పరిశీలించారు. అక్కడ ఉన్న 100 ఎకరాల ప్రభుత్వ భూమి చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఎంతో అనువైనదిగా భావించిన అధికారులు ప్రాథమికంగా 100 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని, భవిష్యత్‌లో విస్తరించాలన్నా ఇక్కడ అనుకూలమైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు అనువైనవిగా గుర్తించి ఆ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలిసింది. పోర్టు అధికారులు, ఏపీఐఐసీ అధికారులు అయ్యవారిపల్లె సమీపంలోని ప్రభుత్వ భూమిని ఇటీవల పరిశీలించారని, ఈ పార్కుతో నియోజకవర్గంలోని యువతకు ఉపాధి లభ్యమవుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభిప్రాయ పడ్డారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550

సాయినాథుడికి లక్ష మల్లెలార్చన

కావలి(టౌన్): ముసునూరు మందాటి చెరువు వద్ద ఉన్న శ్రీసాయి క్షేత్రంలో జరుగుతున్న గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా బుధవారం సాయినాథుడికి సమూహిక లక్షమల్లెల అర్చన పూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, మంగళధ్వని, గోపూజ, తులసి పూజలు జరిగాయి. అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సంధ్యాహారతి అనంతరం మహిళా భక్తులచే సామూహిక లక్షమల్లెల అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు పొట్టేపాలెం నాగేశ్వరరావు తెలిపారు.



న్యూస్ బాక్స్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు సత్కారం

కావలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను బుధవారం విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు రామిరెడ్డి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ పట్ల ప్రజలను ఆకర్షితులను చేసేందుకు కావలిలో తగిన ప్రచారం చేపడతానన్నారు.

బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల సంఘం- ఇండియా ఇంటర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసి అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. బుధవారం మొదటి బ్యాచ్ వలేటివారిపాలెం మండలంకు సంబంధించి 46 మందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ట్రైనర్లుగా బీ కృష్ణవేణి, సీహెచ్ సునీల్‌రెడ్డి బాధ్యత వహించగా, కందుకూరు నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వీ లావణ్య, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కావలి రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎస్. బెనర్జీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్‌గా రిటైర్డ్ జడ్జి ఎ.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు జి. మధుకుమార్, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మి పాల్గొంటారని పేర్కొన్నారు. కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు పాల్గొని దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కరింకోవచ్చని పేర్కొన్నారు.

నేడు కరేడుకు సీపీఐ రామకృష్ణ రాక

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ గురువారం కరేడు గ్రామంలో పర్యటించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పీ మాలకొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కందుకూరు నుంచి కరేడు వరకు యువజన, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో మధ్యాహ్నం 1 గంటకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభం

కలిగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక సాయిబాబా మందిరంలో బుధవారం వేద పండితులు పున్నవజ్జల శేషసాయి ఆధ్వర్యం లో గురుపౌర్ణమి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి జరిగిన పాలభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కరేడులో బలవంతపు భూసేకరణ అపాలి

కందుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కరేడులో రైతుల అభిష్టానికి భిన్నంగా జరుగుతున్న బలవంతపు భూసేకణ ఆపాలని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చారి బుర్రా మధుసూదన్ యాదవ్ కోరారు. బుధవారం ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం బెల్టు షాపులు, కల్తీ మందుల తయారీ కేంద్రంగా మారిందని, రేషన్ మాఫియాలో స్థానిక ఎమ్మెల్యేకు వాటా ఉందని, నియోజకవర్గంలో ప్రతి పనికి కప్పం కట్టమని హుకుం జారీ చేస్తున్నారని విమర్శించారు. కరేడు రైతుల పోరాటానికి వైసీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

గుడ్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రాంగణంలో గురువారం ఉదయం 10 గంటలకు జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి అందరూ హజరై విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయుడు పీవీ రాంమోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత చర్యలను గురించి ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. కనుక ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పక హాజరుకోవాలని పేర్కొన్నారు.



రైల్వే ప్రాంతంలో సంచరిస్తున్న చుక్కల దుప్పులు

వన్యప్రాణులకు రక్షణ కరువు!

- అంతరిస్తున్న అటవీ ప్రాంతం
- ఆహారం, తాగునీరు కరువు
- జనారణ్యంలోకి చుక్కల దుప్పులు, జింకలు
- బిట్రగుంట రైల్వేస్టేషన్ ప్రాంతంలో సంచారం
- రైలు ఢీకొని, కుక్కల దాడిలో మృత్యువాత

బిట్రగుంట, జూలై 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో సహజ సిద్ధమైన అటవీ ప్రాంతం రోజురోజుకి అంతరించిపోతోంది. అటవీ శాఖ అధికారులే అడవుల్లో జామాయిల్, నేరేడు, చందనం, కానుగ తదితర మొక్కలు నాటి పెంపకం చేపడుతున్నారు. దీంతో మరుగు లేక వన్యప్రాణులకు రక్షణ కరువైంది. వాటికి కావాల్సిన ఆహారం, తాగునీరు దొరకక జీవన విధానం కష్టతరంగా మారుతోంది. దీనితో విధిలేని పరిస్థితుల్లో వన్యప్రాణులు జనారణ్యంలోకి పరుగులు తీస్తున్నాయి. ఇలా వచ్చిన చుక్కల దుప్పులు, జింకలు కుక్కల దాడిలో, రైలు, రోడ్డు ప్రామాదాల్లో మృత్యువాత పడుతోన్నాయి. బోగోలు పంచాయతీ అక్కరాజువారి కండ్రిక, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు, నాగులవరం, తాళ్లూరు, సుందరగిరివారికండ్రిక పంచాయతీల శివారు ప్రాంతాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వలన ఆయా గ్రామాల్లోకి తరచూ జింకలు, చుక్కల దుప్పులు చొరబడుతోన్నాయి. అలాగే బిట్రగుంట రైల్వే లోకోషెడ్, కోల్‌యాడ్ ఉన్న సమయంలో రైల్వే కార్మికుల కోసం క్వార్టర్సు, కాలనీ ఇళ్లు, అధికారులకు బంగళాలు ఉండేవి. కాలా నుగుణంగా జరిగిన మార్పులు రావడంతో కార్మికుల సంఖ్య తగ్గిపోయింది. రైల్వే క్వార్టర్సుకు కాలం చెల్లి శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉ న్న కొన్ని ఇళ్లు, బంగళాలు, కార్యాలయాలను తొలగించారు. దీంతో బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు తూర్పు, పడమర ప్రాంతాల్లోని రైల్వే శిథిల భవనాల్లో ముళ్లచెట్లు మొలిచి అడవులను తలపిస్తుండడంతో ఈ ప్రాంతంలో కొంత మరుగు ఏర్పడింది. దీంతో వన్యప్రాణులు నిత్యం అధిక సంఖ్యలో ఇక్కడ సంచరించడం వల్ల ఈ ప్రాంతం వాటికి ఆవాసాలుగా మారింది. ఈ ప్రాంతాల్లో సంచరించే జింకలు, దుప్పులను పసిగట్టిన కుక్కలు దాడిచేసి చంపేస్తున్నాయి. వీటి నుంచి తప్పించుకునే క్రమంలో కొన్ని రైలు పట్టాలపైకి పరుగులు తీసి రైలు ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నాయి. రైలు పట్టాలకు తూర్పున కోవూరుపల్లి చెరువు, కడనూతల చెరువులు ఉం డటం వలన నీటికోసం రైలుపట్టాలు దాటుతూ కూడా మరికొన్ని మృతి చెందుతోన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి అటవీ ప్రాంతంలో తాగునీ వసతులు కల్పిస్తే వన్యప్రాణులు జనారణ్యంలోకి వచ్చే అవకాశం ఉండదు. తద్వారా రోడ్డు, రైలు ప్రామాదాలతో పాటు కుక్కల దాడి నుంచి వాటికి రక్షణ కల్పించవచ్చని ప్రజలు, జంతు ప్రేమికులుఅంటున్నారు. ఇందుకు సంబంధిత అధికారులు ఏ మాత్రం చర్యలు చేపడుతారో వేసి చూడాల్సిందే.



రైలు ఢీకొని మృతి చెందిన చుక్కల దుప్పి(ఫైల్)

సార్వత్రిక సమ్మె విజయవంతం



లింగసముద్రం : ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

కావలి(టౌన్), జూలై 9(ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో జరిగిన సార్వత్రిక సమ్మె విజయవంతం అయింది. ట్రంకురోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకురాలు ఎస్‌కె రెహనా బేగం, ఏఐటీయుసీ జిల్లా నాయకుడు దామా అంకయ్యలు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకురావడం కార్మికుల గొంతు కోయడమేనన్నారు. నల్ల చట్టాలతో కార్మికులు ప్రశ్నించే పోరాడే హక్కు కూడా కోల్పోయే ప్రమాదముందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి కార్మికుల కుటుంబాలను వీదులపాలు చేసి అదాని అంబానీల కుటుంబాలకు ప్రయోజనాలు చేకూర్చుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు లక్ష్మారెడ్డి, పసుపులేటి పెంచలయ్య, కృష్ణమోహన్, నాగరాజు, మల్లె అంకయ్య, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు** : స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. తొలుత ప్రధాన రహదారి వెంట ర్యాలీ నిర్వహించారు. వీటీపీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్, ఇందిరావతి, అంగన్‌వాడీ, పీటీపీ వర్కర్లు, ఆశా, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం** : అంగన్వాడీలకు ప్రభుత్వం కనీసం వేతనం రూ26 వేలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మండలంలోని 44 అంగన్వాడీ కేంద్రాలను మూసివేసి వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు. స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు అంగన్వాడీలు సీఐటీయు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కార్యాలయ జూనియర్ అసిస్టెంటు సాహిత్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు బి.మార్తమ్మ, పి.శైలజ, ఎస్‌కె పరీమా, కె.సుగుణ, పి.శ్రీదేవి, ప్రమీల, సీహెచ్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

● **గుడ్లూరు** : కార్మికులను వీధులపాలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గుడ్లూరులో సీఐటీయు, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలో 60 మంది అంగన్‌వాడి కార్యకర్తలు కేంద్రాలను మూసివేసి పాల్గొన్నారు. వీఆర్‌ఏలు, యునైటెడ్ ఎలక్ట్రికల్ యూనియన్, భవననిర్మాణ కార్మికులు, మహిళాసంఘం, తదితర ప్రజా సంఘాలు సమ్మెకు సంఘీభావం తెలిపారు. రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించిన అనంతరం, బస్టాండ్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు దామా కృష్ణయ్య, కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, కొట్టే పులయ్య, ఎస్.కే పద్మజ, షరీఫ్, అక్కిలగుంట జార్జీ, తదితరులు పాల్గొన్నారు.

● **కలిగిరి** : సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. తమకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల్లా తమకు అన్ని సౌకర్యాలు వర్తింపజేయాలని కోరుతూ ఎంపీపీ మెట్టుకూరు శిరీషకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



ఉలవపాడు : నిరసన తెలుపుతున్న సీఐటీయూ కార్మికులు, అనుబంధ సంఘాల నేతలు



వలేటివారిపాలెం : తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు



అల్లూరు : తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు



బిట్రగుంట : తిప్ప రోడ్డులో నిరసనలు చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నేతలు



గుడ్లూరు : తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

● **వలేటివారిపాలెం** : అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు జిల్లా నాయకులు కుమార్ కోరారు. సీఐటీయు నాయకులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం బస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● **బిట్రగుంట** : బోగోలు మండలంలో సీఐటీయూ, సీపీఎం నేతల ఆధ్వర్యంలో వివిధ కార్మికసంఘాలు సార్వత్రిక సమ్మెను నిర్వహించారు. ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయం నుంచి తిప్ప జాతీయరహదారి మీదుగా తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంలకు వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి, సీపీఎం సీనియర్‌నేత తుమ్మల వెంకయ్య, నేతలు బాదుల్లా, బీ.రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : కేంద్ర ప్రభుత్వం కార్మికులు, కర్షకులకు హానికలిగించే విధంగా కార్మిక చట్టాలను కాలరాస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలలో భాగంగా స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచుపాటి విజయలక్ష్మి, షేక్ రషీద్, మాలపాటి వెంకయ్య, వెంకట రమణమ్మ, సౌజన్య, రమణమ్మ, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు

వలేటివారిపాలెం, జూలై 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యాధికారి శివసిద్ధప్ప తెలిపారు. పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి మాతృత్వ యోజన పథకంలో భాగంగా గర్భిణులకు సాధారణ పరీక్షలు, రక్తపరీక్షలు, యూరిన్, షుగర్, బీపీ, పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేయించుకుంటే జననీ యోజన పథకం కింద రూ.1000 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూటమి పాలనలో ప్రజలు సంతృప్తి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కరపత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని టిక్కులిపాలెం, వెంకటనారాయణ బజార్‌లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం పథకాలు అందుతున్నాయా, మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా తన దృష్టికి తీసుకురావాలని అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసులు, చదలవాడ కొండయ్య, ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు బుద్ధిరాలేదు

రాష్ట్రంలో అరాచకపాలనతో ఐదేళ్ల ప్రభుత్వాన్ని నడిపిన వైసీపీని ప్రజలు ఛీత్కరించుకున్నా వారికి బుద్ధి రాలేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడితే వైసీపి అధినేత ఆ పార్టీ ముఖ్యనాయకులు ఖండించకపోగా మాజీ మంత్రి అనీల్ ప్రసన్నకు మద్దతుగా అదే భాషలో మాట్లాడటం ఆ పార్టీ నేతల స్థాయిని సంస్కారాన్ని తెలుపుతోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు జనగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, కృష్ణారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో ఇంటింటికి..

గుడ్లూరు : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాయుడుపాలెంలో బుధవారం ఆ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు ఉమ్మినేని సుబ్బారావు, చిత్తూరి మల్లికార్జున, మాజీ మండల అధ్యక్షుడు మేకల మాల్యాద్రి, నాయకులు వీరంరాజు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'తొలిఅడుగు'

వలేటివారిపాలెం : మండలంలోని చుండి, గరుకుపాలెం, వలేటివారిపాలెం గ్రామాల్లో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు ప్రగడ శ్రీనివాసులు, శనివారపు మాల్యాద్రి, శనివారపు మాల్యాద్రి, లింగాలదెన్నె వెంకటేశ్వర్లు, కామినేని అశోక్, మేకల అశోక్, కామినేని వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కలిగిరి మండల సమావేశం

● పలువురు అధికారులు, సభ్యులు డుమ్మా

కలిగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశానికి విద్యుత్, వైద్యం, ఆర్టీసీ, అటవీ తదితర శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడంతో ఎంపీపీ శిరీష అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖాధికారుల నుంచి వివరణ తీసుకొని నివేదికను జిల్లా కలెక్టరుకు పంపాలని ఎంపీడీవో ప్రత్యూషకు సూచించారు. అదేవిధంగా గత ఆరు నెలలుగా రెవెన్యూ శాఖలో రైతులకు పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోయామని, అప్పటి తహసీల్దారు రిటైర్ కావడం వలన ప్రస్తుతం డీటీ గిరీషకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారని, భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి రావచ్చని సీనియర్ అసిస్టెంట్ రంతుల్లా తెలిపారు. కలిగిరి మోడల్‌స్కూల్‌లో ఇతరప్రాంతాల విద్యార్థులకు సీట్లు కేటాయించడంతో స్థానిక విద్యార్థులు నష్టపోతున్నారని కావలిముస్తాపురం సర్పంచు పోలవరపు సుబ్బానాయుడు ఎంఈవో సురేష్‌కు సూచించారు.. స్థానిక పీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలు అందించడానికి ఇద్దరు వైద్యులను నియమించినప్పటికీ ఒక్కరు మాత్రమే విధుల్లో ఉంటూ మరొకరు సంతకాలు పెట్టి వెళ్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీపీని కోరారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రసన్న క్షమాపణ చెప్పాలి

కావలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరుస్తూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఆమెకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ నేతలు డిమాండ్ చేశారు. కావలి జర్నలిస్టుక్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ సుధీర్, నియోజకవర్గ అధికారప్రతినిధి మన్నేపల్లి రుషికేష్, వీర మహిళ కొప్పుల లక్ష్మీలు ప్రసన్న చేసిన వాఖ్యలను ఖండించారు. వైసీపీ నాయకులు ఇదే విధంగా మహిళల పట్ల అనుచితంగా నోటికి వచ్చినట్లు మాట్లాడమని, ఆ పార్టీ అధిష్ఠానం వారికి ఇదే నేర్పిస్తున్నట్లుందన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి పవన్‌కల్యాణ్ భార్య, ఆయన వ్యక్తిగత జీవితంపై మాట్లాడారని అదే వైఖరిని ఈ రోజు వైసీపీ నాయకులు అవలంబిస్తున్నారని చెప్పారు. ప్రసన్న కుమార్‌రెడ్డితో పాటు ఆయనకు మద్దతుగా నిలిచిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తదితర నాయకులందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాదు శ్రీధర్, బెల్లంకొండ మస్తాన్, బాలు వెంకయ్య, వీరమహిళలు ప్రసన్న, యామిని, జయలక్ష్మీ, పద్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

రైతుల పోరాటానికి మద్దతుగా నిలవాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కందుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కరేడులో చేస్తున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో సీపీఎం శ్రేణులు అందరు ప్రత్యక్షంగా పాల్గొనాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కందుకూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరేడులో అన్ని ప్రాంతాల్లో తిరిగి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని అన్ని వర్గాల ప్రజలకు వివరించి వారిలో చైతన్యం నింపి ఉద్యమాన్ని బలపరిచాలని, ఇండోసోల్ కరేడును వదిలి వెళ్లే వరకు పోరుబాటలో నిలవాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు చేసిన కృషితో సంతృప్తి పడకుండా నిరంతరం రైతుల కష్టసుఖాల్లో భాగసామ్యులు కావాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా నేత ముప్పరాజు కోటయ్య, ఉలవపాడు, గుడ్లూరు, కందుకూరు ప్రాంతీయ కార్యదర్శులు కుమార్, గౌస్‌బాషా, మాదాల రమణయ్య, దువ్వూరి జాన్ పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతిపై శిక్షణ



అల్లూరు : శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ

అల్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పురోగతి ప్రణాళికపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సచివాలయాల సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రజనీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, ఎస్ఐఆర్‌డీ పరిశీలకులు ప్రసాద్, జిల్లా శిక్షకులు శివ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు ఈ శిక్షణలలో పాల్గొన్నారు.

● **బిట్రగుంట** : మండల అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ జహీర్, పురిణి శ్రీనివాసులు, ఏ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం** : పంచాయతీ అభివృద్ధికి చేపట్టవలసిన ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంపీడీవో ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికొరకు పురోగతి సూచిక (అడ్వాన్స్‌డ్ ఇండెక్స్) అనే నూతన కార్యక్రమం చేపట్టిందన్నారు. పంచాయతీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, సాధించవలసిన లక్ష్యాలపై సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. పంచాయతీలలో రోజువారీ జరిగే కార్యక్రమాలను ఈగ్రామ్ స్వరాజ్ యాప్ నందు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమం ప్రారంభించేముందుగా మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.రవికుమార్, ఏవో శేషసాయి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గానికి జాతీయ గుర్తింపు

- యుద్ధనౌకకు 'ఉదయగిరి'గా నామకరణం
- గత వైభవం పునరావృతం అయ్యేనా...?
- ఎదురుచూస్తున్న ప్రజలు


ఉదయగిరి దుర్గం

ఉదయగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఓవైపు ఎత్తయిన కొండలు... మరోవైపు శత్రుదుర్భేద్యమైన కోటలు... చుట్టూ పచ్చని చెట్లు... పక్షుల కిలకిలారావాలు... మరోవైపు గలగల పారే సెలయేర్లతో ఉదయగిరి దుర్గం తిరుమల గిరులను పోలి ఉంటుంది. జిల్లాకు 100 కిలోమీటర్ల దూరంలో, సముద్రమట్టానికి 3079 అడుగుల ఎత్తులో ఇది ఉంది. 20 కిలోమీటర్ల మేర విస్తరించి, ప్రకృతిశోభతో అలరారుతున్న ఈ దుర్గం క్రీస్తుశకం 10 నుంచి 19వ శతాబ్దం వరకు వెయ్యేళ్ల చరిత్రను తన గర్భంలో దాచుకుంది. ఇంతటి చారిత్రక నేపథ్యం గల దుర్గానికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించనున్నది. ఉదయగిరి పేరుతో యుద్ధనౌక రూపుదిద్దుకుంది. ఆగస్టు 26న నావికాదళం దీన్ని ప్రారంభించి, సముద్రంలోకి ప్రవేశపెట్టనున్నది. దీంతో ఉదయగిరి దుర్గానికి పూర్వవైభవం రానున్నదని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

గతంలో కూడా ఉండేది..

చారిత్రక నేపథ్యం కలిగిన ఉదయగిరి పేరుతో యుద్ధనౌక ప్రారంభానికి సిద్ధమైంది. 149 మీటర్ల పొడవుతో 40 మిస్సైళ్లు ఉండేలా సుమారు రూ.600 కోట్లతో ఈ యుద్ధ నౌకను తయారు చేశారు. గతంలో కూడా ఉదయగిరి పేరుతో యుద్ధ నౌక ఉండేదని, అది శిథిలం కావడంతో ప్రస్తుతం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న యుద్ధ నౌకకు ఉదయగిరి నామకరణం చేసినట్లు నౌకాదళ అధికారులు తెలిపారు.

దుర్గంపై పర్యటన

యుద్ధనౌకకు ఉదయగిరిగా నామకరణం చేయడంతో విశాఖపట్నానికి చెందిన నావికాదళం దుర్గాన్ని సందర్శించింది. లెఫ్టినెంట్ కమాండర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు నరసింగరావు, నవీన్,


ఉదయగిరి పేరుతో త్వరలో ప్రారంభం కానున్న యుద్ధనౌక

ప్రకాశ్ కుమార్ ఐటీవల స్థానిక అధికారులతో కలిసి ఉదయగిరి పట్టణం, దుర్గంపై పలు ప్రాంతాలను సందర్శించారు. చారిత్రాత్మక విషయాలపై చర్చించారు. పంచాయతీ నౌకాదళ కమిటీ నుంచి సంక్షేమ నిధులు వచ్చేలా ప్రయత్నాలు చేస్తామని బృందం సూచించింది.

నాటి వైభవం మళ్లీ వచ్చేనా..?

ఈ క్రమంలో ఉదయగిరి దుర్గానికి నాటి వైభవం మళ్లీ రానుందా...అంటూ ప్రజలు ఎదురుచూస్తున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉదయగిరిలో శ్రీకృష్ణదేవరాయలు 500 ఏళ్ల పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహించారు. ముగింపు సభలో అప్పటి మంత్రి పార్థసారధి రాయల నాటి ఉదయగిరి వైభవం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఐటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగాసనాలు వేసేందుకు కలెక్టర్ ఉదయగిరి రంగనాయకులస్వామి ఆలయాన్ని ఎంపిక చేశారు. ఆలయంలో ఊరేగి వేడుకలు నిర్వహించడంతోపాటు తాజాగా ఉదయగిరి నామకరణం తో యుద్ధనౌక ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండడం, త్వరలో రంగనాయకుల స్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. వీటికితోడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటికే రూ.కోటి మంజూరు చేయించడంతోపాటు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని బట్టి చూస్తే దుర్గానికి మంచిరోజులు రానున్నాయని తెలుస్తోంది.

దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు రామచంద్రమూర్తి, షేక్‌ఎండీ బాషా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీవల కేంద్ర ప్రభుత్వం ఉదయగిరి చారిత్రక ప్రాధాన్యతను గుర్తించి రూ.600 కోట్ల వ్యయంతో నిర్మించిన నావికాదళం యుద్ధనౌకకు ఉదయగిరిగా నామకరణం చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉదయగిరి దుర్గాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరారు.

నా అక్రమ బదిలీకి కారణం చెప్పాలి

- ప్రాణం పోయేవరకు పోరాడుతా...! ● కార్పొరేషన్‌లో సచివాలయ ఉద్యోగి నిరసన



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగి భాస్కర్

నెల్లూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నన్ను ఎందుకు అక్రమంగా బదిలీ చేశారన్నది అధికారులు చెప్పాలి, నా ప్రాణాలు పోయినా పర్వాలేదు, జైల్లో పెట్టి ఉరితీసినా సరే పోరాటం ఆపను. అంటూ కావలి పట్టణం శాంతినగర్‌కు చెందిన సచివాలయ ఉద్యోగి రావెళ్ల భాస్కర్ నిరసనకు దిగారు. తనకు న్యాయం చేయాలంటూ బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ప్లకార్డు పట్టుకుని బైఠాయించారు. ఐటీవల జరిగిన బదిలీల్లో తనకు కావలి మున్సిపల్ కమిషనర్ ఉద్దేశ పూర్వకంగా అన్యాయం చేశారని ఆరోపించారు. తాను కౌన్సెలింగ్ జాబితాలో మొదట ఉన్నానని, తన తరువాత ఆరు మంది ఉన్నారని తెలిపారు. అయితే కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కావలిలో పోస్టింగ్ చూపి.. తీరా ప్రక్రియ పూర్తయ్యాక సూళ్లూరుపేట బదిలీ చేసినట్టు ఉత్తర్వులిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తన వెనుకున్న వారందరికి కావలిలోనే బదిలీ ఉత్తర్వులిచ్చారని తెలిపారు. కావలి మున్సిపల్ కమిషనర్ అవినీతిని తాను ప్రశ్నించినందుకు కక్షపెంచుకుని తనకు అన్యాయం చేశారని, ఈ విషయం కావలి ఎమ్మెల్యేకి కూడా తెలిపానన్నారు. తనను ఎందుకు అక్రమంగా సూళ్లూరుపేట బదిలీ చేశారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనకు నారా లోకేష్, పవన్ కల్యాణ్ ఉద్యమాలే స్ఫూర్తి అని ప్రకటించారు. సమాచారం అందుకున్న పోలీసులు భాస్కర్‌ను అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నం చేశారు. ఈ సంఘటన తాజాగా సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

రాళ్లపాడు కుడి కాలువ గేటు మరమ్మతు పనులకు ఆమోదం

లింగసముద్రం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గత డిసెంబరులో దెబ్బతిన్న రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటు మరమ్మత్తు పనుల ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఆ పూట్లో ప్రాజెక్టు నుంచి వరినార్లకు నీటి విడుదల చేసేందుకు ప్రాజెక్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు ఇతర అధికారులతో కలిసి గేటును పైకి లేపుతుండగా గేటును, రాడ్డుకు మధ్యలో ఉన్న బోల్టు విరిగిపోయి తూముకు అడ్డుగా గేటు కిందపడి పోయింది. దీంతో అధికారులు గేటును పైకి లేపేందుకు నరసరావుపేటకు చెందిన మెకానిక్ బాషా, బెకామ్ కంపెనీకి చెందిన బృందాన్ని రప్పించి ప్రయత్నించి, విఫలమయ్యారు. చివరకు మెగా కంపెనీకి చెందిన ఎల్లయ్య డైవింగ్ టీం గేటును పైకి లేపడంతో నీరు విడుదల అయ్యాయి.దీంతో అధికారులు మరమ్మతులకు రూ.22.50 లక్షలు అవసరమని ఈ ఏడాది జనవరి 15వ తేదీన ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.దీంతో బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రిమండలి ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఎస్‌హెచ్‌జీల డిజిటలైజేషన్
వేగవంతం చేయాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేసేందుకు గ్రూపుల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వార్షిక రుణ, జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికపై అవగాహన సదస్సు జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీలకు రుణ పరిమితి పెంచి, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. పొదుపు మహిళలు చిన్నచిన్న యూనిట్లు స్థాపించేందుకు సహకరించాలని సూచించారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను వివిధగా అందించి వారు సులభంగా బ్యాంకు రుణాలు పొందేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకం ద్వారా రెడీ టూ ఈట్, రెడీ టు కుక్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పొదుపు మహిళలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తించి ఈ పథకం ద్వారా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను, అధికారులను ఆదేశించారు. తొలుత డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు సబ్సిడీపై కేటాయించిన పిండిమిల్లులు, చపాతి తయారీ మిషన్లు, వ్యవసాయ పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 731 బేళ్లను తీసుకొని రాగా, 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. వారు 569బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 162 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ.159 పలికినట్లు వేలం నిర్వహణా ధికారి జీ.రాజశేఖర్ తెలిపారు.

మాదిగల అభివృద్ధికి రూ.40వేల కోట్లు

- మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి

నెల్లూరు (హరనాథపురం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మాదిగల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఐందుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.40వేల కోట్లు కేటాయించినట్లు మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. బుధవారం నెల్లూరు పర్యటనకు వచ్చిన ఆమె ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. దళితులను అన్నిరకాలుగా ఆదుకోవటంలో భాగంగా స్త్రైవర్లను కారు ఓనర్లుగా చేసే విధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో సబ్సిడీపై ఇన్నోవా కార్లు అందజేసిందని, విదేశీ విద్య పథకాన్ని అమలు చేసిందని చెప్పారు. వీటిని వైసీపీ ప్రభుత్వం కనుమరుగు చేసిందని విమర్శించారు. నెల్లూరు పర్యటనలో భాగంగా తొలుత ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని పరిశీలించానని శ్రీదేవి తెలిపారు. మాదిగల అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని వివరించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ లీడ్ ఏజెన్సీగా రైతు సాధికార సంస్థ

అమరావతి, జూలై9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరువు అనుసరణ, ఉపశమనం ద్వారా ప్రకృతి వ్యవసాయం స్థాయి వ్యవసాయ పర్యావరణ పరివర్తన ప్రాజెక్ట్ అమలుకు లీడ్ ఏజెన్సీగా ఏపీ రైతుసాధికార సంస్థను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో ముగ్గురు అదనపు డైరెక్టర్ల తుది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానశాఖలో 1.2 స్థాయి గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఆ శాఖ డైరెక్టర్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. పట్టు పరిశ్రమశాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ కేటగిరీలో 2017 నుంచి ప్రొబేషన్‌లో ఉన్న ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించి, ఇప్పటికే రిటైరైన వారికి కోర్టు ఆదేశాల మేరకు పెన్షన్ ప్రయోజనాలు కల్పించేలా ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రహరీ దిమ్మె కూలి ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

కావలిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రహరీ గోడ గేటు దిమ్మె కూలి ఒక కూలీ మృతి చెందగా మరో కూలీకి గాయాలైన ఘటన కావలి పట్టణంలోని 8వ వార్డు వెంకటాద్రిపాలెంలో బుధవారం జరిగింది. 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. ఓంటం వారిపాలెం జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మురుగు నీటి కాలువ ఏర్పాటుకు ఎక్స్‌కవేటర్ కాలువ తవ్వుతుండగా కొందరు కూలీలు కాలువలో మట్టిని తీయిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ఒక ఇంటి పాత ప్రహరీ గేట్ దిమ్మె కూలి ప్రమాదవశాత్తు కూలీలపై పడింది. ఈ ఘటనలో బోగోలు మండలం సాంబశివపురంకు చెందిన వెంకయ్య(55) తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. వైకుంఠపురంకు చెందిన మరో కూలీ మహబూబ్‌బాషాకు గాయాలయ్యాయి. వారి పక్కనే ఉన్న మరో ఇద్దరు కూలీలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మృతుడికి భార్య ఆదెమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సుమన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరో క్రస్ట్ గేట్ ద్వారా నీటి విడుదల

అనంతసాగరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 149 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, జలాశయంలో 29.160 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 6వ నెంబర్ క్రస్ట్ గేట్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 325 క్యూసెక్కుల నీటిని వదులు తున్నామన్నారు. క్రస్ట్‌గేట్ ద్వారా నీరు విడుదల చేయడంతో సోమశిల-నెల్లూరు మధ్య రాకపోకలు స్తంభించాయి.


క్రస్ట్‌గేట్ ద్వారా విడుదల చేసిన జలాలు

కార్మిక అనుకూల నిర్ణయాలు ఉండాలి

- బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో సుబ్బారెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 9(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లో కార్మిక అనుకూల నిర్ణయాలు ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి పి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరులోని ఏపీజీబీ రీజనల్ కార్యాలయం వద్ద బ్యాంకు యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు సమ్మె చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్మికులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు కార్మిక వ్యతిరేకంగా ఉన్నాయని ఆరోపించారు. బ్యాంకుల్లో ఐపీవోలు ప్రవేశపెట్టారని, ఉద్యోగ నియామకాలు లేవన్నారు. పని ఒత్తిడి పెరిగిపోయిందన్నారు. బ్యాంకులను, ఎల్‌ఐసీని ప్రైవేట్ పరం చేయాలన్న కేంద్రప్రభుత్వ ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో ఏపీజీబీ ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ కార్యదర్శి లియాఖత్ అలీ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఏపీజీబీ రీజనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

రామలింగేశ్వర స్వామి 16 రోజుల పెళ్లి వేడుకలు

- నందివాహనంపై ఊరేగిన స్వామి ● తరలివచ్చిన భక్తజనం

విడవలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో వెలసిన శ్రీ కామాక్షీదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణం జరిగి బుధవారంతో 16 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారి 16 రోజుల పెళ్లి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన దొడ్ల వేణుగోపాల్ రెడ్డి, సలీమబి వంశీప్రియ, కుమారుడు సాయి నిఖిల్ రెడ్డి, కోడలు నిహారిక ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. తొలుత ఆలయ అర్చకులు సేరేపి శ్రీకాంత్ శర్మ స్వామి, అమ్మవార్లకు మహాన్యాస రుద్రాభిషేకాలు, నివేదన, హారతి, మంత్ర పుష్పం, తీర్థ, అన్న ప్రసాద వినియోగం నిర్వహించారు. సుందరంగా ముస్తాబు చేసిన నందిసేవ వాహనంపై రామలింగేశ్వరునికి సతీసమేతంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు దేవస్థానం హేచరీస్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అఖండ శివనామ సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈవో బొగ్గం మల్లికార్జునరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ నాటూరు విజయకుమార్, దాడి సన్యాసి రావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు

- లేబర్ కోడ్‌లు రద్దు, కార్మిక చట్టాల అమలుకు డిమాండ్
- పాల్గొన్న సీపీఎం, కాంగ్రెస్, వైసీపీ, సీపీఐ పలు కార్మిక సంఘాలు



ప్రదర్శన నిర్వహిస్తున్న పలు కార్మిక సంఘాలు

నెల్లూరు (వైద్యం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత కార్మిక సంఘాల సమ్మె పిలుపు మేరకు నెల్లూరు నగరంలో పలు కార్మిక సంఘాలు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఈ సార్వత్రిక సమ్మెలో పెద్ద సంఖ్యలో కార్మికులు కదం తొక్కారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. ఏసీసీ కాంపౌండ్ నుంచి మద్రాసు బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వర రావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్, ఐఎఫ్‌టీయూ నాయకుడు సాగర్, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకుడు యానాదయ్య ప్రసంగించారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలని కోరారు. జీవో నెంబర్ 21ని రద్దు చేసి 10 గంటల పనివిధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు జయకుమార్ రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కొండాప్రసాద్, పెంచలనరసయ్య, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, ఆర్ శ్రీనివాసులు, మూలం ప్రసాద్, సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్, ఏఐటీయూసీ నాయకుడు బసవరాజు, ఐఎన్‌టీయూసీ నాయకులు మల్లికార్జున రెడ్డి, సునీత పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే
కరేడులో భూసేకరణ!

- ఉన్నతస్థాయి పరిశీలనలో గ్రామస్థుల అభిప్రాయాలు
- మూడేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్ల ఆధారంగా భూముల ధర నిర్ణయం
- 'ఆంధ్రజ్యోతి'తో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ

? కరేడులో భూసేకరణ ప్రక్రియపై తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది కదా

! ప్రస్తుతానికి భూసేకరణ ప్రక్రియ యధావిధిగా నడుస్తోంది. రైతుల్లో రకరకాల భయాందోళనలు రేకెత్తి ఉన్నందున వారికి సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చి వారి సహకారంతోనే భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తాం.

? భూములు ఇవ్వలేమని గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు కదా



! రైతుల ఆందోళనలు, వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, గ్రామసభ తీర్మానం తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఈ సమస్యపై ఉన్నత స్థాయిలో కూడా చర్చ జరుగుతోంది.

? రైతులంతా వ్యక్తిగతంగా మీకు అర్జీలు అందజేశారు

! 573 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. ఈ అర్జీలపై భూసేకరణ నిబంధనల ప్రకారం ముందుకెళ్తాం. వారందరికీ భూసేకరణ అధికారి ప్రతిఒక్కరికీ వ్యక్తిగతంగా వారు తెలిపిన అభ్యంతరాలకు సమాధానం పంపిస్తాం. ఆ తర్వాతే ప్రక్రియలో మరో అడుగు ముందుకు వేస్తాం.

? అంటే భూసేకరణ ప్రక్రియ ఆగే అవకాశం లేదంటారు

! అలా అని కాదు. ప్రభుత్వ నిర్ణయం, నిబంధనల ప్రకారం ప్రక్రియ ఉంటుంది. కొందరు రైతుల్లో తమ భూములను తగిన ధర దక్కదేమోనన్న సందేహాలు ఉన్నాయి. మత్స్యకారుల్లో తమ జీవనాధారమైన వేటకు అవకాశం లేకుండా పోతుందేమోనన్న సందేహాలు ఉన్నాయి. అలాగే ఇండోసోల్ కోసం ఖాళీ చేయించాల్సి వస్తున్న మూడు కాలనీల వాసులకు తమ పునరావాసం పరిస్థితి ఏమిటన్న ఆందోళన ఉంది. వారి సందేహాలను నివృత్తిచేసి వారికి సంతృప్తి కలిగేలా చేయగలిగితే భూసేకరణ అంగీకరించే అవకాశం ఉంటుందేమో చూడాలి కదా.

? అసలు భూముల ధర నిర్ణయించారా

! మిగిలిన గ్రామాలతో పోలిస్తే కరేడులో రిజిస్ట్రేషన్ విలువలు తక్కువ ఉన్నాయి. ఆ విలువల ప్రకారం చూసి నిబంధనల ప్రకారం వచ్చే ధరలపై ఊహాగానాలు బయట ప్రచారంలో ఉన్నాయి. ఆ ప్రకారం అయితే మెట్ట, మాగాణి భూమికి రూ.15 లక్షలు, తోటలకు రూ.17 లక్షలు, జాతీయ రహదారి పక్కనుండే భూములకు రూ.60 లక్షల పరిహారం అందే అవకాశం ఉంది. అయితే మూడేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్ల ఆధారంగా సేల్‌వాల్యూలను చూసి సరాసరి చేసి రైతుల అభిప్రాయాలను కూడా తెలుసుకొని ధర నిర్ణయించే అవకాశం ఉంటుంది.

? కరేడు చెరువు, ప్రభుత్వ భూముల పరిస్థితి ఏమిటి

! చెరువులు, ఇతర వాటర్‌బాడీలు జోలికివెళ్లం. అవి అలాగే ఉంటాయి. ఇక ప్రభుత్వ భూమి 1150 ఎకరాల వరకు భూసేకరణలో పోయే అవకాశం ఉంది. ఆ భూమికి కూడా రైతులకు ఎంతమొత్తం అయితే చెల్లిస్తారో ఆ ప్రకారమే ఇండోసోల్ కంపెనీ నుంచి ప్రభుత్వానికి చెల్లించడం జరుగుతుంది.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)


విడవలూరు : అరటి మొక్కలు, మామిడి తోరణాలతో పెళ్లి మండపంలా రూపుదిద్దుకున్న జడ్పీ హైస్కూలు

తల్లిదండ్రులతో చర్చిద్దాం..
విద్యార్థులను చదివిద్దాం..!

- నేడు ప్రతిష్ఠాత్మకంగా మెగా పీటీఎం-2.0
- విద్యార్థుల భవిష్యత్‌కు రాష్ట్ర ప్రభుత్వం భరోసా

నెల్లూరు (విద్య), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యావ్యవస్థలో అతిపెద్ద పండుగను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా 3,422 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనుంది. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థుల వికాసం, సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం మార్గదర్శకం చేయడంతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ వారధిగా ఈ సమావేశం నిలుస్తుందని అధికారులు తెలిపారు. విద్యావహిమాన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందజేయనున్నారు. విద్యార్థుల మార్కులకు సంబంధించి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందజేయనున్నారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన బుక్‌లెట్ పంపిణీ చేస్తారు. గ్రీన్‌పాస్ ఏర్పాటు చేసి విద్యార్థులతో వారి లక్ష్యాలను దానిపై రాయిస్తారు. అమ్మపేరుతో మొక్కలు నాటేలా ప్రోత్సహిస్తారు. కాగా, ఈ ఏడాది ప్రైవేట్ విద్యాసంస్థల్లోనూ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అన్ని జూనియర్ కళాశాలలు, పాఠశాలలకు ఇది వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

సర్వం సిద్ధం చేశాం : డీఈవో

జిల్లావ్యాప్తంగా గురువారం జరిగే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో బాలాజీరావు తెలిపారు. జిల్లాలోని వివిధ స్థాయిల్లో ప్రజాప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటారు. ప్రతి పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయడంతో పాటు 2,30,330 మంది విద్యార్థులతో మొక్కలు నాటించనున్నాం.

పీఎంఏజేవై అమలుకు అప్రైజల్ కమిటీ

అమరావతి : పీఎంఏజేవై పథకం అమలుకు జిల్లా స్థాయి ప్రాజెక్టు అప్రైజల్ కం కన్వర్జెన్స్ కమిటీ ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్/కమిషనర్ చైర్‌పర్సన్‌గా, జడ్పీ సీఈఓ వైస్ చైర్‌పర్సన్‌గాను, పంచాయతీరాజ్ ఎస్ఈ, డీఆర్‌డీఏ పీడీ, మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ, డీఈఓ, డీఎంఅండ్‌హెచ్ఓ, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఆర్అండ్‌బీ ఎస్ఈ, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ /ఈఈ, విద్యుత్ శాఖ ఎస్ఈ, ఎస్‌సీ డీఎం, ఐదు పీఎంఏజేవై గ్రామాల నుండి ప్రతినిధులు తదితరులతో కమిటీని ఏర్పాటు చేశారు.